ఓం వేదాంతభేరి ఓం



మాస శివరాత్రినాడు ఆశ్రమ శివాలయంలో శివునికి పూజ



ఆశ్రమంలో కృత్తిక నాడు సుబ్రహ్మణ్య స్వామి వారికి పూజ

ॐ వేదాంతభేరి ॐ

సంస్థాపకులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 54   ఆగష్టు 2021   సంచిక : 08

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు, ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 2000/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ॐ **వేదాంతభేరి** ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 54 **ఆగష్టు 2021** **సంచిక : 08**

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి
 - శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. ఏకాంతము - శ్రీసద్గురు మలయాళస్వాములవారు - 09
04. సాధన పంచకము - శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు - 12
05. శ్వేతాశ్వతరోపనిషత్తు - శ్రీ శంకర భగవత్పాదుల వారి సంబంధ భాష్యము
 - ఆచార్య శంకరానందగిరి స్వాములవారు - 16
06. కృష్ణస్తు భగవాన్ స్వయమ్ - ఆచార్య గల్లా చలపతి - 22
07. సుఖము - శ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు - 28
08. అన్నమయ్య - శరణాగతి - డా॥ సముద్రాల లక్ష్మణయ్య - 34
09. హరిదాస సంప్రదాయ శ్రీకృష్ణుడు - ఆచార్య కె.సర్వోత్తమరావు -38
10. వార్తలు - 42

ముఖచిత్రం - మురళీ ధర కృష్ణుడు

15-08-2021వ తేది భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవము
20-08-2021వ తేది వరలక్ష్మీ వ్రతము
21-08-2021వ తేది ఓణం (కేరళ దేశ పండుగ)
22-08-2021వ తేది శ్రావణ పూర్ణిమ
30-08-2021వ తేది శ్రీకృష్ణ జన్మాష్టమి

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

1. సంసారకూపే పతితో ఽ త్యగాధే
మోహాన్ధపూర్ణే విషయాభితప్తే ।
కరావలమ్బం మమ దేహి విష్ణో
గోవిన్ద ! దామోదర !మాధవేతి ॥

2. జిహ్వే ! సదైవం భజ సున్దరాణి
నామాని కృష్ణస్య మనోహరాణి ।
సమస్త భక్తార్తి వినాశనాని
గోవిన్ద ! దామోదర ! మాధవేతి ॥

3. శ్రీకృష్ణ ! రాధావర గోకులేశ
గోపాల ! గోవర్ధన నాథ విష్ణో !
జిహ్వే పిబస్వామృత మేతదేవ
గోవిన్ద ! దామోదర ! మాధవేతి !

4. శ్రీనాథ ! విశ్వేశ్వర విశ్వమూర్తే
శ్రీ దేవకీనన్దన ! దైత్య శత్రో
జిహ్వే పిబస్వామృతమేతదేవ
గోవిన్ద దామోదర ! మాధవేతి ।

5. ప్రాణేశ విశ్వమ్భర ! కైటభారే!
వైకుఠ ! నారాయణ ! చక్రపాణే !
జిహ్వే ! పిబస్వామృతమేతదేవ
గోవిన్ద ! దామోదర ! మాధవేతి !!

6. హరే ! మురారే ! మధుసూదనాద్య
శ్రీరామ ! సీతావర ! రావణారే
జిహ్వే పిబస్వామృత మేతదేవ
గోవిన్ద ! దామోదర ! మాధవేతి !!

బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ఒకానొక చెట్టుయొక్క చిటారుకొమ్మపై ఒక పక్షి కూర్చుండి ప్రశాంత చిత్తముతో దిక్కులను వీక్షించుచు గంభీర భావముతో వర్తించు చుండెను. ఇంకొక పక్షి ఆ చెట్టు మధ్యభాగమున ఇటునటు తిరుగుచు చంచల స్వభావముగల్గి, ఒక్కొక్కసారి మధుర ఫలమును తిని సంతోషించుచు, మఱియు ఒక్కొక్కసారి కటుఫలమును భక్షించి ఏడ్చుచు ఈ ప్రకారముగ సుఖదుఃఖములచే నానాయాతనల నొందుచు నుండెను. ఇట్లుండ కొంత సేపటికి క్రిందనున్న పక్షి పైన హాయిగా కూర్చొనియున్న పక్షిని పరికించి, నెమ్మది నెమ్మదిగ పైకి యెగిరి దానిచెంతకు చేరగనే క్రమముగ దానిలో విలయమైపోయెను. అపుడిక రెండు పక్షులు లేవు పైపక్షి ఒకటియే శేషించి యుండెను.

ద్వా సువర్ణా సయుజా సఖాయా
సమానం వృక్షం పరిషస్వజాతే
తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి
అనశ్నన్నన్యో ఽ భిచాకశీతి. (ఉపనిషత్)

ఉపనిషత్తులందు కావింపబడిన చక్కటి చిత్రణమిది. ఈ జగద్రూప వృక్షమున పరమాత్మ, జీవుడు అను రెండు పక్షులు కలవు. ఆత్మరూపపక్షి నిశ్చలమై నిర్వికారమై సుఖదుఃఖాది ద్వంద్వవర్జితమై గంభీరముగ వెలయుచున్నది. జీవుడను పక్షి చంచలమై, అనిశ్చతభావము గల్గి సుఖదుఃఖములను ద్వంద్వములను అనుభవించుచు విషయానందము పొందినపుడు ఉబ్బిపోవుచు, దుఃఖము సంప్రాప్తమైనపుడు కృంగి

కృశించుచు ఈ ప్రకారముగ చిత్తచాంచల్యము ననుభవించుచు, ఎట్టకేలకు పరమాత్మయను పై పక్షిని గూర్చి తెలిసికొని, క్రమక్రమముగ సాధనాతిశయముచే ఆ పక్షి సమీపమునకేగుచున్నది. ఏగుటయే తడవుగా, అగ్నిలోపడిన మిడత అగ్ని భావమునే పొందునట్లును, సముద్రమును జేరిన నది సముద్రరూపమునే జెందునట్లును జీవుడు పరమాత్మ రూపమునే బడయు చున్నాడు. అదియే జీవబ్రహ్మైక్యము. అపుడు జీవుడు, శివుడు అను రెండు రూపములుండవు. జీవుడు శివుడే యగుచున్నాడు. మానవుడుగా పరిణతి జెందుచున్నాడు నరుడిక నరుడుగా నుండక నారాయణరూపుడై భాసించు చున్నాడు. ఇదియే జీవుని చరమస్థితి. జీవుని అంతిమలక్ష్యమిదియే.

జీవుడు విషయ సుఖములకై ప్రాకులాడుచు తనకున్న అమూల్య సమయమును ధారబోయక చక్కని ఆధ్యాత్మిక సేవగావించుచు అభ్యాస యోగమును జేబట్టి భక్తిజ్ఞాన వైరాగ్యములను లెస్సగ సాధించుట ద్వారా ఆత్మసాక్షాత్కారమును ఈ జన్మయందే సాధించవలెను. క్రిందనున్న పక్షివలె దుఃఖము నందు కాలము గడుపరాదు. జీవుడీ లోకమునకు ఏతెంచినది శోకించుటకు కాదని ముమ్మాటికి జ్ఞప్తియందుంచుకొనవలెను. ఏడ్పును పోగొట్టుకొను ఉపాయమును పెద్దలవలన తెలిసికొని దుఃఖమునకు శాశ్వతముగ తిలాంజలి నొసంగుటకే మానవజన్మ ఏర్పడినదని నిశ్చయించు కొనవలెను. తాను ఏకాలమందును పరిచ్ఛిన్నుడు కాదనియు, దేహరూప బంధము మధ్యలో వచ్చి మధ్యలో పోవునదేయనియు, తానుఉపాధి రహితుడైన సచ్చిదానందాత్మ స్వరూపుడనియు పరిపూర్ణముగ నిశ్చయించవలెను.

'చిదానందరూపశ్శివో ఽహం శివో ఽహం' అని నిరంతరము ఎలుగెత్తి చాటుచు అట్టి బ్రహ్మానందాత్మానుభూతియందే కాలము గడుపు చుండవలెను. చక్కటి ఆధ్యాత్మిక పరిశ్రమచేతను, ఆకుంఠిత భక్తిశ్రద్ధలచేతను అట్టి అలౌకిక స్థితిని జీవుడు తప్పక చేరుకొనగలడు. కావున ముముక్షువగు వాడు తాను పంచభూతాత్మకమై, జడమైనట్టి ఒకచిన్న ఆస్థిపంజరము కాదనియు, బంకమట్టితో చేయబడిన ఈ దేహమను ఇల్లు తాను కాదనియు

విశ్వవ్యాపకమై, జననమరణ రహితమై, చిన్మయ స్వరూపమైనట్టి ఆత్మయే తాననియు అహర్నిశము భావించుచుండవలెను. 'తద్బ్రహ్మ నిష్కళమహం న చ భూత సంఘః' 'నిష్కళమగు ఆ బ్రహ్మమునే నేను గాని పంచభూతాత్మక జడసముదాయమగు ఈ దేహమునుగాను' అను శ్రీ శంకరాచార్యుల వాక్యమును సదా స్మృతిపథమున నుంచుకొనవలెను.

మహోన్నతమగు ఈ మానవ జీవితమును సార్థకమొనర్చు కొనదలంచువారు, ఈ జీవితమందే మోక్షసామ్రాజ్యాభిషిక్తులు కాదలంచు వారు, మఱల గర్భనరకమందు పడి నానాయాతనలనుభవించకుండ తప్పించుకొనదలంచువారు పైన దెల్పిన ఉపనిషద్వాక్యములను నిరంతరు సంస్మరించుచు గంభీరాత్మభావమును అలవరచుకొనుచు అభ్యాస ప్రాబల్యముచే, సాధనాతిశయుచే బ్రహ్మసాక్షాత్కారమొంది జీవన్ముక్తులై నెగడుదురుగాక !

'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' 'బ్రహ్మమును తెలిసికొనువాడు బ్రహ్మమే యగును' అను వాక్యమును సదా జ్ఞప్తియందుంచుకొని బ్రహ్మజ్ఞాన సముపార్జన ద్వారా సాక్షాత్ బ్రహ్మరూపులే అయి జీవితములను చరితార్థ మొనర్చుకొందురు గాక !

వేదాన్తభేరి మూలనిధికి ఈక్రింది వారు పైకం పంపినారు

1. జె.మల్లిక (గుంటూరు) - రూ. 2000/-
2. కె.వెంకటసత్య శివప్రసాద్ (బెంగుళూరు) - రూ. 1000/-
3. అల్లె వెంకటకృష్ణారెడ్డి (కమలాపురం) - రూ. 2000/-
4. అల్లె శిరీష (కమలాపురం) - రూ. 2000/-
5. అల్లె వెంకటసుబ్బమ్మ (కమలాపరం) - రూ. 2000/-
6. అల్లె శ్రీవత్సల రెడ్డి (కమలాపురం) - రూ. 2000/-
7. అల్లె శివాత్మిక (కమలాపురం) - రూ. 2000/-

ఏకాంతము

- శ్రీ మలయాళస్వాములవారు

ఏకాంతము ఏకాగ్రత కొరకు ముముక్షువులకు ఎంతో సహాయము కలుగజేయును. చిత్రకారుడు ఏకాగ్రత లేక సర్వభావయుక్తముగా ఒక చిత్రమును గూడా చిత్రింపజాలడు. ఆలాగున కవులు కూడా గొప్ప కావ్యమును రచించునప్పుడు ఏకాంతము, ఏకాగ్రతను అవలంబించు చున్నారు. మరియు గొప్పదియగు ఒక లెక్కను గుణించునప్పుడు కూడా ఏకాగ్రత లేక ఏకాంత సహాయము లేక ఎవరున్నూ చేయజాలరు. ఆలాగున చారిత్రకమగు దీర్ఘమైన ఒక వ్యాసమును వ్రాయవలసియుండినను కూడా ఏకాగ్రత అత్యవసరము. సామాన్యముగా ఉన్నతపరీక్షలో చదువుచున్న విద్యార్థులు ఏకాంతము నవలంబించుచున్నారు. కర్ణాది ఇంద్రియములకు విషయమగు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాదులను గూడా నిజముగా గ్రహించవలసియుండిన నింద్రియములను జాగ్రత్తపరచిన మాత్రమే అట్టి సూక్ష్మ విషయమును స్పష్టముగా గ్రహించవలసియుండును. సూక్ష్మాతి సూక్ష్మమగు పరమాత్మను, పరబ్రహ్మమును, ఆత్మను అవగాహనము చేయవలసియుండిన చిత్తమునకు ఎంత ఏకాగ్రత, నిర్మలత్వము నుండవలయునో ఆలోచించుకొనవచ్చును.

సామాన్యముగా ఒక సన్నసూది బెజ్జములో దారము నెక్కించవలసి యుండిన, సూక్ష్మమైన గురిని లేక ఒక వస్తువును ఛేదించవలసిన ధనుర్ధారికి ఎంత చిత్తైకాగ్రతయుండవలయునో మనమందరమున్నూ ఎరింగిన విషయమే. కావుననే మహర్షులు, యోగీశ్వరులు ఏకాంతమున చిత్తై కాగ్రతగలిగి పరమాత్మానుభవమును పొందిరి. వర్తమాన కాలమున ఇంద్రియ పరవశులైన వారికిది కొంత కఠినముగా లేక అనవసరముగా

తోచినను ఇంద్రియములను జయించి యింద్రియాతీతమగు పరబ్రహ్మమును పొందిన వారికిది అతిశయోక్తిగా గోచరింపదు. శ్రీ బుద్ధ, శ్రీయేసు, శ్రీమహమ్మద్, పరమహంస మొదలగు వారి యొక్క చరిత్రను జీర్ణము చేసుకొన్నవారికిది సత్యముగానే, అవసరముగానే తోచును. మన వేదాంత గ్రంథములు, ఉపనిషత్తులు, భగవద్గీత మొదలైన ఆర్షగ్రంథములన్నియు ఈ పరమ సత్యమునే ఉద్ఘోషించుచున్నవి. అయితే బుద్ధాది మహనీయులందరు జనులకు ధర్మమును, జ్ఞానమును, దైవతత్త్వమును బోధించలేదా యని ప్రశ్న యొకటి బయలుపడగలదు. అయితే ఆ పరమ సత్యమును,ఆ దైవత్వమును పొందేవరకు ఆ మహనీయాత్ములు ఏకాంతమున ఏకాగ్రత గలిగియుండిరనియు, దానిని పొందిన తరువాత జనసమూహమునకు వచ్చి బోధించిరనియు, వారి చరిత్రలో మనము కనుగొనగలము. భారతీయ పరమ ఋషులను అనుసరించి మరల చెప్పనవసరము లేదు. ఘటము కాలిన తరువాత నీటిలో నుంచినను, వానలో తడిసినను కరుగదను తత్త్వము ముముక్షువులు గ్రహించుకొనిన చాలును. ఈ విషయమై పరివ్రాజకోపనిషత్తు ఉపదేశించినది చూడుడు.

అనేన విధినా సర్వాంస్త్యక్త్వా సంగాన్ శనైశ్శనైః ।

సర్వద్వంద్వై ర్వినిర్ముక్తో బ్రహ్మణ్యేవావతిష్ఠ

బ్రహ్మనిష్ఠుడు మెల్లమెల్లగా సమస్త బంధములను, దానికి సంబంధించిన ప్రతి బంధములను వదిలి సుఖదుఃఖ, లాభనష్ట, శీతోష్ణాది ద్వంద్వముల త్యజించి పరబ్రహ్మమందే యుంటున్నాడు. దీనియందు 'శనైశ్శనైః' అని ప్రయోగించుట వల్ల ఈ యింద్రియాతీతస్థితి ఒకేసారి సిద్ధించునది కాదనియు, అనేకసార్లు నింపాదిగ యత్నము చేయ వలెననియు ఉపదేశించడమైనది. ఈ సత్యమునే ఆత్మసంయమ యోగమగు ఆరవ

అధ్యాయమున శ్రీకృష్ణభగవాను డుపదేశించెను.

శనైశ్శనై రుపరమేద్బుద్ధ్యా ధృతి గృహీతయా ।

ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్ ॥

ఆత్మభావమును, బ్రహ్మభావమును అవలంబించి దృఢమైన బుద్ధి చేత మనస్సును ఆత్మయందు నిలకడగా జేసి మెల్లమెల్లగా ఆత్మప్రాప్తిని పొందవలయును. లేక మనస్సును ఆత్మలో లయపరచవలయును. తరువాత ఆత్మతత్త్వము కంటె నితరమైన దానిని కొంచెమైనను చింతన చేయకూడదు.

శ్రావణ మాస విశిష్టత

1. శ్రావణ మాసం మహావిష్ణువుకు ప్రీతికర మాసము.

2. శ్రావణ శుద్ధ ఏకాదశీ పుత్రదా ఏకాదశి,

3. గరుడ పంచమి శ్రావణ మాసంలోనే

4. శ్రావణ మంగళవారం నాడు మంగళగౌరీవ్రతం చేస్తారు.

5. శ్రావణ పౌర్ణమికి ముందటి శుక్రవారం వరలక్ష్మీ వ్రతం చేస్తారు.

5. శ్రావణ పౌర్ణమి జంధ్యాల పండుగ. నేడు పాతయజ్ఞోప వీతాలను తీసివేసి కొత్తయజ్ఞోపవీతాలను వేసుకొంటారు.

6. శ్రావణ పౌర్ణమినాడు మహారాష్ట్రులు వరుణదేవుని అనుగ్రహం కోసరం కొబ్బరికాయలు కొడుతారు. అందుకనే దీనిని నారికేళపౌర్ణమి అంటారు.

7. ఈ పౌర్ణమి రక్షాబన్ధన్ పౌర్ణమి. నేడు రక్షాబన్ధన్ దినము.

8. ఈ శ్రావణ పౌర్ణమినాడు హయగ్రీవుడు జన్మించాడు. హయగ్రీవుడు జ్ఞానప్రదాత, విద్యాప్రదాత.

9. శ్రావణ బహుళ అష్టమి శ్రీకృష్ణజన్మాష్టమి. నేడు శ్రీకృష్ణపరమాత్మ దేవకీ వసుదేవులకు జన్మించాడు.

10. ఈ మాసంలోనే కేరళ దేశీయులకు ముఖ్యమైన ఓనం పండుగ.

సాధన పంచకము

- శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

(గత సంచిక తరువాయి)

ప్రాక్కర్మ ప్రవిలాప్యతామ్

సంచిత కర్మను నాశము చేయవలెను. ప్రాక్కర్మ అనగా సంచితకర్మ. సంచితకర్మ యనగా –"జన్మాంతర హేతుభూతం సదవస్థితం. పూర్వ జన్మీయం కర్మ" అని లక్షణము। మరియు "అనారబ్ద ఫలకర్మ విశేషం" రాశీకృతం" సంపాదితమ్ " ఈ మొదలగునవి సంచిత లక్షణములు. సంచితకర్మలే జన్మకు కారణం, జన్మ జన్మలలో అనుభవించగా, ప్రతి జన్మలో చేస్తున్న కర్మఫలం జన్మాంతములో సంచితముగానగును. కర్మఫలాల రాశీభూతమే సంచితము. ప్రోగు చేయబడినదని అర్థము. ఫలభోగమునకు సంసిద్ధము కాని కర్మనే సంచితకర్మ యందురు. ఈ సంచిత కర్మలు నష్టముకానంతవరకు జన్మలు తప్పవు. యుగములుగడచినను ప్రళయముజరిగిన సంచిత కర్మ నష్టము కాదు. భూమండలంలోనున్న నదులన్నిటిలోను స్నానమాచరించినను సంచిత కర్మ నష్టము కాదు. వీటివలన పుణ్యఫలం వచ్చి సంచితము పెరుగును. కోటిపారాయణలు శ్రీవిష్ణు, శివ, లలితా, గీతాది పారాయణలు చేసిన పుణ్యము వచ్చును. కాని సంచితము నష్టము కాదు. కోటి జపములు, కోటి ధ్యానములు చేసిన , కోటి దానములు చేసిన సంచిత కర్మలను నష్టము చేయజాలవు. ఈ కర్మల వలన, మానవ జన్మకు తగు ఆయుర్దాయము గలిగి ధన, కనక, వస్తు వాహనములు గలుగును. కర్మల ఫలాధిక్యము వలన అత్యున్నతమైన పదవులు ప్రపంచములో గలుగును. జన్మ, జరా, దుఃఖ ప్రవాహము తప్పదు. జ్యోతిష్టోమాది యజ్ఞములు,అశ్వమేధ,రాజసూయ, ధర్శపూర్ణమాసాది యజ్ఞములు ఎన్ని చేసినను స్వర్గలోకాదులు ప్రాప్తమయి అచ్చట భోగాదుల ననుభవించి 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి" అని గీత చెప్పినట్లుగా తిరిగి మానవ లోకంలో జన్మనెత్తును. సంచిత కర్మ ఏవిధముగా నష్టము గలుగును. అన్న ప్రశ్నకు సమాధానము గీత 4-19లో "జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం". 4-37లో "జ్ఞానాగ్ని సర్వకర్మాణి భస్మసాత్కురుతేతథా" అని శ్రీకృష్ణపరమాత్మ చెప్పిరి. "తత్వజ్ఞానేన సంచితం నశ్యేత్" అని శాస్త్రాంతరము –ఆత్మనాత్మా విచారణ ద్వారా, మూడు కాలములలో నాశము కానిది, సర్వ జగత్తుకు ఆధారమైనది, సకల జీవులకు ఆశ్రయమైనది. ప్రత్యక్షముగా కంటికి కనుపించనిది అయినదే పరమాత్మ. ఆ పరబ్రహ్మమే జగత్తుకు ఆధారమైనది. ఆ పరబ్రహ్మమే నేను. నేనే ఆ పరబ్రహ్మమును అని దృఢమైన జ్ఞానము వలననే సంచిత కర్మఫలం భస్మమగును. వేగిన శెనగగింజ మొలకెత్తని చందమున, జ్ఞానాగ్ని ద్వారా భస్మమైన కర్మఫలం జన్మనీయదు. జన్మ లేదు అని అర్థము. కావున మానవమాత్రుడు వేద విహిత కర్మలు పరమేశ్వరార్పణ బుద్ధితో చేస్తూ, కర్తృత్వ అహంకారమును వదలి, జపధ్యానాదులుశీలిస్తూ ఆత్మానాత్మ విచారమైన సచ్ఛాస్త్రమును అనగా భగవద్గీత, వివేక చూడామణి, ఉపదేశ సాహస్రి, శంకరాచార్యులవారి ప్రకరణ గ్రంథములు, వేదాంత పంచదశీ, యోగవాసిష్ఠము. ఉపనిషత్తులు బ్రహ్మసూత్రములు మొదలగు వానిని ప్రతిదినం ఒకగ్రంథం పూర్తయ్యే వరకు అర్థగంట స్వయముగా చదువుకొనవలెను. సత్సంగములు వినవలెను. సదాచారమును పాలించవలెను. ఈ అభ్యాసముతో ఆత్మజ్ఞానముత్పన్నమయి సంచిత కర్మ ఫలం నశించును అని ఆచార్యులవారు చెప్పినారు.

చితిబలాన్నాప్యుత్తరైః శ్లిష్యతామ్ ।

ధృఢాపరోక్షాత్మజ్ఞాన బలముచే ఆత్మజ్ఞాని ఆగామి కర్మఫలముల చేతను అంటబడడు. ఇచ్చట ఆచార్యులవారు ఆగామి అర్థములో ఉత్తర

శబ్దము ప్రయోగించారు. ఉత్తర శబ్దమునకు అనేకార్థములున్నవి. మరుమాట, మారుమాట, ప్రత్యుత్తరము, ఎడమవైపు, శివుడు, విష్ణువు భవిష్యత్ కాలము, ఉత్తర దిక్కు ఈ మొదలగు అర్థములున్నవి.

భవిష్యత్ అన్న ఆగామి = రానున్న కాలము అని ఈ అర్థములను ఉత్తర శబ్దము తెలియజేయును. ఆగామి కర్మయనగా - మానవుడు వర్తమానము జీవితములో తనకు జ్ఞానము తెలిసినప్పటి నుండి అనగా అక్షరాభ్యాసమును పొంది అధ్యాపకుల ద్వారా ధర్మాధర్మ విచక్షణా జ్ఞానము గలిగిన నుండి, మరణించిన వరకు చేయు శుభ అశుభ కర్మల ఫలమును ఆగామి కర్మ ఫలమందురు. విద్యాభ్యాసము లేనివారు వ్యావహారిక జ్ఞానము గలిగిన నుండి చనిపోయిన వరకు చేయుకర్మను ఆగామికర్మయందురు. ఇది మరణానంతరము సంచిత కర్మఫలములలో చేరును. ఇవన్నియు జన్మలకు హేతువగును. ఆగామి కర్మఫలములు జప, ధ్యాన యోగ సాధనలు, పూజా, హోమ, దానాదుల వలన నష్టం కావు. ఏవిధముగా నష్టమగునంటే - చితిబలాత్ అని ఈసాధనలో చెప్పియున్నారు. మానవులలో స్త్రీలు గాని, పురుషులుగాని, బాలురుగాని వృద్ధులు గాని, బ్రాహ్మణులుగాని, బ్రాహ్మణేతరులు గాని -ఎవరైనను సద్గురు సన్నిధిలో తత్త్వమసి మహా వాక్యమునుశ్రవణం చేసి సర్వవ్యాపియైన పరబ్రహ్మమును నేనే అని తెలుసుకొని, నేను ఆ పరబ్రహ్మమునే గాని వేరుగాదు అని. అనగా 'అహం బ్రహ్మాస్మి బ్రహ్మైవాహమస్మి' అని ధృడాపరోక్ష జ్ఞానమును పొందిన వారికి "నశ్లిష్యతామ్ = " కర్మ ఫలములు అంటవు. అనగా నష్టమగునని భావము.

ఆగామి విషయంలో వివేక చూడామణిలో 450 శ్లో ॥

"స్వ మసంగముదాసీనం పరిజ్ఞాయ నభో యథా । ॥

నశ్లిష్యతి చ యత్కించిత్కదాచిద్భావికర్మభిః" ॥

జ్ఞాని తనను తాను ఈక్రింది విధముగా భావించవలెను. ఆకాశము దేనితోను సంబంధము లేక ఏవిధముగా నున్నదో ఆ విధముగా నేను అసంగుడను, నిర్వ్యాపారిని, సాక్షిని, తటస్థుడను, చలనము లేని పరమాత్మను అని బాగుగా తెలిసికొనవలెను. ఈవిధముగా తెలిసికొన్నవారు ఆగామి కర్మలచేతను, కొంచెము గూడ సంబంధపడరు. ఆకాశము వలె సర్వకర్మలచేత వాటి ఫలములచే నిర్లిప్తుడు. భగవద్గీత..."జ్ఞానాగ్ని సర్వకర్మాణి భస్మ సాత్కురుతే తథా" । జ్ఞాని సంచిత కర్మలను, ఆగామికర్మలనే కట్టెలను ఆపరబ్రహ్మమును నేనే యను జ్ఞానాగ్నిలో భస్మము చేయుచున్నాడు యని భావము. వివేక చూడామణి 451 శ్లోకము -

"న నభో ఘటయోగేన సురాగంధేన లిప్యతే ।

తథా ఽఽ త్మోపాధి యోగేన తద్ధర్మైః న లిప్యతే" ॥

కుండలో అమృతం పోసిన ఘటాకాశమునకు అమృత సువాసన కించిత్ గూడా అంటదో, సురాపానమనే కల్లు కుండలోపోసిన కల్లు యొక్క వాసన ఆకాశమునకు ఎట్లు అంటదో, ఆవిధముగా శరీరాంతర్గతమై, విలక్షణమై, భాసించుచున్న కూటస్థాత్మయగు తాను పరబ్రహ్మమును అనిజ్ఞాని భావించును. కావున జ్ఞానికి ఘటాకాశములవలె యుపాధి ధర్మములు, ఆగామి కర్మఫలములున్ను స్పృశించవు, సకల కర్మ ఫలరహితుడై, జ్ఞానస్వరూపియై యుండునని శ్రీ ఆచార్యులవారు 38 సాధనలో నిరూపించిరి.

వేదాన్తభేరినిధికి ఈ క్రిందివారు తమ పోషక చందా పంపినారు

1. సి. హెచ్.ఎస్. అప్పలనాయుడు (సికింద్రాబాద్) - రూ. 2000/-
2. దేశం వెంకటమ్మ (నంద్యాల) - రూ. 2000/-

త్రినేత్ర వైద్యాలయ నిధికి ఈ క్రిందివారు తమ పైకం పంపినారు

1. ఆర్. రాధికా చేతన (శ్రీకాళహస్తి) - రూ. 45000/-

శ్వేతాశ్వతరోపనిషత్తు - శ్రీశంకర భగవత్పాదుల వారి సంబంధ భాష్యము

అనువాదం - ఆచార్య శంకరానందగిరి స్వాములవారు

(జూన్ సంచిక తరువాయి)

అనువాదం : శ్రీ విష్ణుపురాణంలో చెప్పబడిన విషయం -- ఓ జగత్ప్రభో! నీవొక్కడవే కేవల పరమాత్మవు. నీకంటే భిన్నంగా వేరే లేనే లేదు. దేనిచేత ఈ చరాచర జగత్తు వ్యాప్తమై వుందో అది నీమహిమనే. మూర్తరూపంలో కనబడే ఈజగత్తు జ్ఞానస్వరూపుడవైన నీ ప్రతిరూపమే. ఇంద్రియ నిగ్రహం లేని జీవులు తమ భ్రమపూర్ణ జ్ఞానంతో దీనిని జగద్రూపంగా భావిస్తారు. సంపూర్ణ జ్ఞానస్వరూపమైన జగత్తును తమ ప్రయోజనకారిగా భావించే బుద్ధిహీన జీవులు మోహరూప మహాసాగరంలో మాటిమాటికి తిరుగవల్సి వుంటుంది. కాని శుద్ధచిత్తులైన జ్ఞానులు ఈ సంపూర్ణ జగత్తును జ్ఞానమయ పరమాత్మరూపంగానే భావిస్తారు. (చూస్తారు). నేను ఈజగత్తు జనార్దనుడైన శ్రీహరిపరమాత్మ స్వరూపమే. పరమాత్మకంటే భిన్నంగా కార్యకారణ వర్గం లేదని నిశ్చయం గల జీవులకు తిరిగి ఈ సాంసారిక రాగద్వేషాది ద్వన్ద్వరూపరోగం వుండనే వుండదు. వాస్తవిక అత్యంత నిర్మల జ్ఞానస్వరూప పరమాత్మయే అజ్ఞానదృష్టిచే భ్రాన్తిగా విభిన్న పదార్థాల రూపంలో ప్రతీతమగు చున్నది. జ్ఞానస్వరూపుడైన భగవంతుడు పదార్థాకారంగా లేడు. పర్వతాలు, సముద్రాలు, పృథ్వి ఇత్యాది విభిన్న పదార్థాలను నీవు విజ్ఞానవిలాసమని తెలిసికో, ఓ ద్విజోత్తమా ! ఈ కనుపించే ఘటపటాది పదార్థాల్లో ఏ వస్తువైన ఆదిమధ్యాంతాలు లేకుండ సర్వదా ఏకరూపమై వుందా? ఈ భూమియందు మార్పుచెందే వస్తువు పూర్వరూపంలో వుండదు. అలాంటప్పుడు ఆ వస్తువులో వాస్తవికత ఎలా వుంటుంది? మట్టియే కుండరూపాన్ని ధరిస్తుంది. తిరిగి ఆ కుండ నుండి కపాలం, కపాలం

నుండి చూర్ణం, చూర్ణం నుండి కణాలు. వాటి నుండి అణువులుగా మారుతాయి. ఇక చెప్పు తన కర్మలకు వశీభూతుడై ఆత్మనిశ్చయాన్ని మరచిన మానవుడు కనుపించే వాటిలో దేన్ని సత్యవస్తువుగా చూస్తున్నాడు? (గ్రహిస్తున్నాడు.) అందువలన ఓ బ్రాహ్మణోత్తమా ! విజ్ఞానానికంటే వేరుగా ఎక్కడ ఎప్పుడు గూడ సత్యవస్తువు లేనే లేదు. తమ తమ కర్మలకారణం చేత విభిన్న చిత్తవృత్తులతో కూడుకుని వున్న జీవులకు ఒకే విజ్ఞానం విభిన్నరూపాలుగా ప్రతీతమవుతుంది. రాగద్వేషాది మలరహితుడు, శోకశూన్యుడు, లోభాది సంపూర్ణ దోష వర్జితుడు సదా ఏకరసమై, అసంగమై, ఏకమాత్ర విశుద్ధవిజ్ఞానమే సర్వశ్రేష్ఠుడైన వాసుదేవ పరమాత్మ. అతనికంటే భిన్నంగా వేరే లేనే లేదు."

స చాపి జాతిస్మరణాప్తబోధస్తత్రైవ జన్మన్యపవర్గమాప ॥

అనువాదం : ఈరకంగా నీకు నేను పరమార్థ స్వరూపాన్ని నిరూపించాను. ఒక జ్ఞానమే సత్యమైనది. మిగత సర్వం మిథ్య. దీనికి భిన్నంగా కనుపించే వ్యావహారిక సత్యమైన ఈ త్రిభువనాలు గూడ ఆతత్త్వాన్నే ఆశ్రయించి వున్నాయి. కర్మ అవిద్యాజనితం. అది సమస్త జీవుల్లో విద్యమానమై వుంది. కాని ఆత్మ శుద్ధము, నిర్వికారము, శాంతము, నిర్గుణము ప్రకృతికి అతీతమై వుంది. సంపూర్ణ ప్రాణుల్లో విద్యమానమైవున్న ఆత్మకు మాత్రము హానివృద్ధులు లేవు. ఓ రాజా ! కాలాంతరంలో పరిణామాదులవలన కలిగే ఏ ఇతర భావాన్ని పొందకుండ వుండేదే వాస్తవిక పరమార్థ వస్తువు. ఇలాంటి వస్తువు ఆత్మకంటే భిన్నంగా వేరే ఏముంటుంది? ఓ నృపశ్రేష్ఠా! నా కంటే భిన్నంగా ఒకవేళ ఉన్నట్లయితే నేను ఫలానా ఫలానా అని చేప్పేదానికి వీలుండేది. సంపూర్ణ శరీరాల్లో ఒకే ఆత్మవున్నందువలన 'నీవెవరు' 'నేను ఫలానా' ఇత్యాది వాక్యాలు వంచనా మాత్రమే. నీవు రాజువు, మేము పల్లకీ మోసేవారము, మేము మీ ముందు వెళ్లే వాహకులము, వీరందరూ

మీ పరిజనము అనే ఈ వ్యవహారము నీకు సరియైనది కాదు. వ్యవహారంలో వున్న రాజు రాజసేవకాదులు, దేన్ని రాజత్వమంటామో దీనికి భిన్నంగా వుండే పదార్థాలు ఇవన్నీ సంకల్పాత్మకమే. అవినాశియైన పరమార్థతత్త్వ ప్రాప్తి జ్ఞానులకు మాత్రమే లభిస్తుంది. ఓ రాజా ! నాతో పరమార్థతత్త్వాన్ని సంక్షేపంగా శ్రవణం చేయి. సర్వవ్యాపి సర్వత్ర సమభావంతో వున్న శుద్ధ నిర్గుణతత్త్వం ప్రకృతికి అతీతం, జన్మవృద్ధులు లేనిది సర్వవ్యాపి అవినాశి ఆత్మ ఒక్కటి. అది పరమజ్ఞానమయం. ఓరాజా! ఆ ప్రభువుకు వాస్తవికంగా నామ జాతి మొదలగు వాటితో సంయోగం ఇంతవరకు లేదు, ప్రస్తుతం లేదు, భవిష్యత్తులో గూడ కలుగదు. ఈ రకంగా కలిగిన విశేష జ్ఞానమే పరమార్థమైనది. ద్వైతవాదీ అపరమార్థదర్శీ. ఓ విద్వాంసుడా! ఈరకంగా సమస్త జగత్తు వాసుదేవపేరు గల పరమాత్మ యొక్క అభిన్న స్వరూపం మాత్రమే. గురుమూర్తియైన ఋభుని ఈలాంటి ఉపదేశంతో నిదాఘుడను శిష్యుడుగూడ అద్వైత పరాయణుడయ్యాడు. అప్పటి నుండి అతను సమస్త ప్రాణులయందున్న ఆత్మను తన ఆత్మను అభేదస్వరూపంగా అనుభవించాడు. తరువాత అతనికి బ్రహ్మసాక్షాత్కారం కలిగింది. ఈవిధంగా అతనికి ఉత్కృష్టమైన మోక్షప్రాప్తి కలిగింది. ఒకే ఆకాశం తెలుపు నలుపు ఎరుపు మొదలగు విభిన్న రూపాలతో ప్రతీతమయినట్లు భ్రమగ్రస్తమయిన దృష్టిగలవానికి ఆత్మ ఒకటే అయినప్పటికీ భిన్నభిన్నంగా గోచరిస్తుంది. ఈజగత్తులో కనుపించేదంతా ఒకే పరమాత్మ మాత్రమే. అతనికంటే భిన్నంగా ఏమీ లేనే లేదు. అదే నీవు, అదే నేను, అదే ఈ సమస్త చరాచర జగత్తు ఆత్మస్వరూపమైన శ్రీహరి మాత్రమే. నీవు భేదభ్రమను విడిచిపెట్టు. అవధూత ఈ విధంగా చెప్పినందున ఆ సౌవీర నరేంద్రుడు పరమార్థదృష్టి సంపన్నుడై భేదబుద్ధిని వదలి వేశాడు. ఆ బ్రాహ్మణుడు గూడ పూర్వజన్మ స్మరణ వున్నందువలన తత్త్వజ్ఞానం కలిగి అదే జన్మలో మోక్షాన్ని పొందాడు."

అనువాదం -- లింగపురాణంలో చెప్పబడిన విధంగా -- సమస్త జీవులకు ఈ సంసారం అజ్ఞాన కారణం చేతనే లభించింది. విచారించినందున స్వతంత్రుడైన పరమాత్మ పరతంత్రుడైన జీవాత్మలో వాస్తవికభేదం లేదు. అహెూ ! అందులో ఏకత్వమే లేనపుడు ద్వైతం మాత్రం ఎక్కడి నుండి వచ్చింది ? మరణధర్మం గలవాడు గూడ లేడు, ఇక మృత్యువనేది ఎక్కడి నుండి వస్తుంది ? అతను అంతఃప్రజ్ఞుడు (లోపలివిషయం తెలిసినవాడు) బహిఃప్రజ్ఞుడు (వెలుపలి విషయం తెలిసిన వాడు), ఈ రెంటినీ తెలిసినవాడు ప్రజ్ఞానఘనుడూ కాదు. అందువలన అతను న ప్రజ్ఞ ఉత్కృష్టజ్ఞానం గలవాడు కాదు. న అప్రజ్ఞ జ్ఞానం లేనివాడు గూడ కాదు. స్వరూపజ్ఞానం కలిగిన తరువాత జ్ఞేయ పదార్థమనేది వుండదు. వాస్తవికంగా మోక్షస్వరూపమే. ఇదంతయూ అజ్ఞానాంధకారకారణంచేత మాత్రమే. ఈ విషయంలో ఏ మాత్రం విచారించవల్సిన అవసరం లేదు. ఓ ద్విజులారా! ఆత్మకు జ్ఞానం కలుగదు. బంధనం లేదు మోక్షమూ లేదు. జీవుడు ప్రకృతికాదు, వికృతీకాదు. వీటి వికారమూకాదు. కనుపించేదంతా సదసద్విలక్షణమైన మాయా స్వరూపమే.

" ఈవిషయాన్నే పరాశరభగవంతుడు గూడ చెప్పుచున్నాడు -- మాయచేతనే ఈ విశ్వం ఉత్పన్నమై మాయయందే లీనమవుతుంది. జీవుడు మాయామయ మాయచే బంధింపబడి స్వయం అనేక ప్రకారాల శరీరధారణ చేస్తాడు. వాస్తవికంగా స్వయం సంసారాన్ని పొందడు, ఎదుటివారిని సంసారంలో ప్రవృత్తునిగా చేయడు. ఎందుకంటే అతను కర్తా కాదు, భోక్తా కాదు, ప్రకృతికాదు పురుషుడుకాదు, మాయకాదు, ప్రాణమూకాదు వాస్తవికంగా అతను చైతన్య స్వరూపుడే. ఈ సంసారం అజ్ఞానమూలమే. ఆత్మనిత్యం, సర్వగతం, కూటస్థం నిర్దోషం. తన మాయాశక్తి ద్వారానే భేదరూపాన్ని పొందుతాడు స్వరూపతః కాదు. మునులగువారు ఆ తత్త్వాన్ని అద్వైతం గానే భావించారు (గ్రహించారు).

అంతేకాదు ఈజగత్తును జ్ఞానరూపంగానే అనుభవించి చెప్పారు. దోషదృష్టిగలవారు అజ్ఞానకారణంగా ప్రపంచాన్ని సత్యంగా భావిస్తారు. చైతన్యాత్మ వాస్తవికంగా కూటస్థనిత్యం నిర్గుణం సర్వవ్యాపకము. భ్రాంతిదృష్టిగల వారికి మాత్రమే అది పదార్థాకారంలో ప్రతీతమవుతుంది. జీవుడు ఆత్మను పరమార్థరూపంలో సాక్షాత్కరించినపుడు ఈ ద్వైత ప్రపంచాన్ని మాయామాత్రంగా అర్థం చేసుకుంటాడు. అదే సమయంలో వ్యక్తి పరమ శాంతిని పొందుతాడు. అందువలన విజ్ఞానం మాత్రమే వుంది. ప్రపంచం లేదు సంసారం లేదు. ఈ రకంగా శ్రుతి మొదలగు వాటిచేత నామరూపాదులను దిగ్దర్శనం చేసినందువలన స్వరూపతః బాధింపబడి ప్రపంచమిథ్యాత్వం సిద్ధిస్తుంది. బ్రహ్మ అస్థూలాదిలక్షణాలు గలిగినది. దీనికి భిన్నమైన స్థూలాకార ప్రపంచం మిథ్యయని గ్రహించాలి. ఒకే చంద్రుడు దోషం చేత రెండుగా కనుపించినా మిథ్యారూపమని ఎలా భావిస్తామో అలాగే ఈ ప్రపంచం గూడ మిథ్యయని గ్రహించాలి."

అనువాదం - బ్రహ్మసూత్రకారులైన వ్యాసులవారు -- "న స్థానతో౽ పి పరస్యోభయలింగం సర్వత్ర హి" అను సూత్రం ద్వారా స్వరూప మరియు ఉపాధిరూపంతో బ్రహ్మము యొక్క (సవిశేష, నిర్విశేష) ఈ రెండు పరస్పరం విరుద్ధరూపాలు సంభవించినందున బ్రహ్మ నిర్విశేషమేయని ప్రతిపాదించి "న భేదాదితి చేన్న ప్రత్యేకమతద్వచనాత్" అను సూత్రం ద్వారా 'న భేదాత్' అను ఈ అంశం ద్వారా భేదశ్రుతి సామర్థ్యంతో బ్రహ్మను సవిశేషంగా గ్రహించ వచ్చునని సందేహించి "న ప్రత్యేకమతద్వచనాత్" అను అంశచేత ఉపాధిజనితభేద శ్రుతి చేతనే బాధింపబడినందున అభేదశ్రుతి సామర్థ్యం చేత సవిశేష బ్రహ్మను గ్రహించే దానికి వీలేదు. బ్రహ్మ నిర్విశేషమేయని నిర్ణయించబడినది. దీని తరువాత "అపిచైవమేకే" అను సూత్రం ద్వారా వేరువేరు శాఖలవారు భేదదృష్టిని నిందిస్తూ అభేదాన్నే ప్రతిపాదించారని నిశ్చయించబడినది. విషయమేమంటే 'ఆత్మ మనస్సు ద్వారానే పొందబడుతుంది' 'తత్త్వమందు నానా అనేది ఏమాత్రమూ లేదు.' 'అనేకంగా చూచేవారు మృత్యువు నుండి మృత్యువును పొందుతారు.' 'ఆత్మను ఏకరూపంగానే చూడాలి' 'భోక్త భోగ్యం ప్రేరకుడు ఈమూడు విధాలుగా చెప్పబడింది బ్రహ్మము మాత్రమే.' ఈ లాంటి శ్రుతులద్వారా భోక్త భోగ్య ప్రేరకరూపంలో సమస్త ప్రపంచమూ ఏకమాత్ర బ్రహ్మమనే చెప్పబడింది. **(సశేషం)**

01. భారతదేశం యోగభూమి, వేదభూమి. వ్యక్తిత్వము సమన్వయము, వైరాగ్యము, ఆధ్యాత్మిక దర్శనము అలవరచిన దేశం యిది. 'సమ-ధీ' అంటే అన్నివస్తువులూ దివ్యత్వ నిలయాలుగా గుర్తించగల సమదృష్టిని భారతదేశం బోధించింది. సమత్వమనేది ఉత్పత్తి మీద, స్వభావం మీద ఆధారపడి ఉంటుంది. చెరువులో, బావిలో, నదిలో ఉన్నది వర్షజలమే. వాన నీరు కురిసిన తావునుబట్టి ఆ నీటిని నింపుకొన్న వస్తువుల పరిశుభ్రతను బట్టి ఈ నీరు రంగులో, రుచిలో వేరుగా కనబడుతుంది. దివ్యానుగ్రహం అందరిపైనా కురిసే నిర్మలమైన వర్షధార. ఆ వర్షాన్ని స్వీకరించి వినియోగించుకోవడం మానవుని హృదయ పాత్ర మీద ఆధారపడి ఉంటుంది.

2. నారదునిలాగ రాగద్వేషాలను ప్రయోజనాత్మకంగా వినియోగించండి. భగవంతుని పట్ల అనురక్తినీ, అహంకారం, గర్వం పాపం మొదలైన వాటి విషయంలో విరక్తిని కలిగించుకోవాలి. నిప్పు నీరు శత్రువులు. నీరు నిప్పును ఆర్పివేయుట నిజమే. కానీ, ఆ నిప్పు మీద నీరు కాచినప్పుడు ఆవిరి బయలుదేరును. ఆవిరి బలముతో ఎంతో బరువైన సామాన్య పెట్టెలను పట్టాల మీద ఈడ్చుకొని పోగలుగుతున్నాయి.

3. సుఖాలకోసం, సంపదలకోసరం, పరితపించకండి. భగవంతుని పట్ల విశ్వాసముంటే రామనామమును ఎడబాయని సహచరునిగా మీరు భావిస్తే. సర్వకాలములో మీరు వైకుంఠములో, కైలాసములో, స్వర్గంలో వున్నట్లే. అవి మీ హృదయాలలోనే వున్న శాన్తిధామాలు.

4. భగవంతుని తప్ప ఇంక దేనిని కోరనివాడే భక్తుడు **- సత్యసాయి బాబా**

కృష్ణస్తు భగవాన్ స్వయమ్..

- ఆచార్య గల్లా చలపతి

(శ్రీ ఆచార్య చలపతి గారు ఈ మధ్యనే శ్రీకృష్ణ సాయుజ్యాన్ని పొందినారు. వారికి మా శ్రద్ధాంజలి. సం ॥)

"తరుణారుణ కరుణామయ విపులా ఽ యత నయనం
కమలా కుచ కలశీ భర విపులీకృత పులకమ్
మురలీరవ తరలీకృత ముని మానసనలినం
మమ ఖేలతి మమచేతసి మధురాధర మమృతమ్ "

శ్రీకృష్ణ పరమాత్మ యొక్క అమృతరూపం నా చిత్తంలో క్రీడిస్తోంది. అది ఎలా ఉన్నదంటే - కొంచెం ఎర్రగా ఉన్న విశాలమైన దయగల నేత్రాలు కలిగి ఉంది. లక్ష్మీదేవి యొక్క కలశముల వంటి స్తనభారం మీద మిక్కిలిగా రోమాంచం కలిగిస్తూ ఉంది. తన వేణునాదం చేత మునుల మనస్సులనే కమలాలను కూడా చపలంగా చేయగల్గుతోంది. కమ్మని మోవి కలిగి ఉంది. 'శ్రీకృష్ణకర్ణామృతం'లో లీలాశుకునికి శ్రీకృష్ణపరమాత్మ సాక్షాత్కరించిన తీరిది. శ్రీకృష్ణుని పేరు వినపడగానే మనసు సమ్మోహితమవుతుంది. ఆయన లీలామానుషత్వం, మోక్షప్రదత్వం మనసులో రూపుదాల్చి కనిపిస్తాయి. బాలకృష్ణుడు, మురలీకృష్ణుడు,గోపాలకృష్ణుడు, రాధాకృష్ణుడు, గోపికాకృష్ణుడు, గీతాకృష్ణుడు కండ్లముందు మెదలుతారు. బృందావనం నుండి మధురకు, మధుర నుండి ద్వారకకు శ్రీకృష్ణుని ప్రస్థానం సాగింది. గోకులంలో శైవదశ, బృందావనంలో బాల్యదశ, మధురలో కౌమార దశ, ద్వారకలో యౌవన, ప్రౌఢ, వృద్ధాప్య దశలను గడిపినట్లు తెలుస్తుంది. 'యతః కృష్ణః తతోధర్మః - యతో ధర్మః తతోజయః' అని వైదిక, లౌకిక వాఙ్మయ శాఖలన్నీ ప్రతిపాదించాయి.

జననకాలంలో దేవకీ వసుదేవులకు, శిశుప్రాయంలో యశోదకు, తరువాత తరువాత అక్రూరునికి, ధృతరాష్ట్రునికి, అర్జునునికి, ఉదంకునికి తన దివ్యరూపాన్ని దర్శింపజేసిన శ్రీకృష్ణుడు ద్వాపరయుగం చివరన తీసుకొన్న పరిపూర్ణావతారం. ఆంధ్రదేశంలో శ్రీరామ, శ్రీకృష్ణభక్తి ప్రవాహాలు సమంగానే ప్రవహించాయి. ఇవి రెండూ పూర్ణావతారాలు కావడం దీనికి కారణం. అయితే 15వ శతాబ్దంలో పోతన తెలుగు భాగవత అవతరణం వల్ల, 16వ శతాబ్దంలో చైతన్య మహాప్రభువు వల్ల ఆంధ్రదేశంలో కృష్ణభక్తి ఎక్కువగా ప్రచారమైంది. ఒకవేళ శ్రీకృష్ణకర్ణామృతం కర్త లీలాశుకుడు ఆంధ్రదేశానికి చెందిన వాడైతే ఇంకా రెండు శతాబ్దాల ముందు కాలం నుండే కృష్ణభక్తి ఇక్కడ ప్రచారమైనదని చెప్పడానికి అవకాశముంది. లీలాశుకుడు కేరళ రాష్ట్రంలోని మలబారు ప్రాంతానికి చెందినవాడని కొందరు భావిస్తారు.

భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ అవసరమైనప్పుడు స్వయంగా పుడుతూ ఉంటానని చెప్పాడు. అలాంటి పుట్టుకలనే మనం అవతారమంటాం. ప్రాచీనకాలం నుండి బీజప్రాయంగా కనిపించిన అవతారభావన భగవద్గీత కాలానికి ఒక సిద్ధాంతంగా రూపొందింది. 'యదాయదాహిధర్మస్య', 'పరిత్రాణాయసాధూనాం' వంటి విషయాలు దీనిని నిరూపిస్తున్నాయి. శ్రీకృష్ణుడు నిర్వహించిన అనేకానేక కార్యాలను పరిశీలిస్తే పరమాత్మ అవతారం ధరించడానికి గల ప్రధానకారణాలనలా ఉంచి ఒక చిన్న ఊహను కూడా చేయవచ్చు. గురువు చెపుతూ ఉంటాడు. శిష్యుడు విని మరిచిపోతూ ఉంటాడు. మరచిపోయాను మళ్లీ చెప్పమని శిష్యుడు అడుగుతూ ఉండడం కూడా వింటూ ఉంటాం. (శ్రీకృష్ణార్జుల విషయంలో ఇది జరిగింది గదా! ఉత్తర గీత రావడానికి ఇదేగదా కారణం) గురువు మళ్లీ చెపుతూ ఉంటాడు. గురువు స్థానంలో పరమాత్మను, శిష్యుడి స్థానంలో ప్రాకృత జగత్తును భావించుకుంటే

అవతార ప్రయోజనం మరింత స్పష్టంగా బోధపడుతుంది. చెడును పూర్తిగా నశింపజేసి మంచిని స్థాపించడం సంప్రదాయ పరిరక్షణే కదా! అవతారాలన్నిటా ఈ ప్రయోజనం కనపడుతూనే ఉంటుంది. శ్రీకృష్ణావతార విషయంలో ఈ ప్రయోజనం నూటికి నూరుశాతం నెరవేరింది.

ఏ ఇతర అవతారమూ (పూర్ణావతారమైన శ్రీరామావతారం కూడా) తాను అవతారమూర్తినని ప్రకటించుకోలేదు. శ్రీకృష్ణుడు తానే పరమాత్మనని 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' అని తననే శరణు పొందమని బాహాటంగా ప్రకటించిన విషయం స్పష్టంగా తెలుసు. శ్రీకృష్ణుడు శత్రువులను సంహరించేటప్పుడు మహాభయంకరుడు. ధర్మం స్థాపించడంలో అమిత శాంతస్వభావుడు. అవసరం ఏర్పడినప్పుడు ఎంతటివారినైనా లెక్కచేయడు. తరతమ భేదాలకు తావుండదు. శ్రీకృష్ణ దర్శనం అనంతముఖాలుగా ఉంటుంది. భక్తుల తారతమ్యాలను బట్టి అనుభవంలోకి వస్తుంది. కృష్ణకథ పరిపూర్ణమైన మానవతకు నిలయం. ఎలాంటి పరిస్థితులలోనైనా ఆయన ముఖంమీద చిరునవ్వు చెరగదు. శ్రీకృష్ణుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణాంశ సంభూతుడు కాబట్టి చక్రం పట్టకపోయినా యుద్ధ చక్రం తిప్పగలడు. శిష్టరక్షణకోసం దుష్టశిక్షణ చేయగలడు. భారతంలో శ్రీకృష్ణుడు దివ్యాదివ్యుడు. భాగవతాది మహాపురాణాలలో ఆయన దివ్యుడు.

మహాభారతంలో అర్జునుడు మత్స్యయంత్రం ఛేదించినప్పటి నుండి శ్రీకృష్ణుని పాత్ర కనిపిస్తుంది. ఎక్కడ ధర్మం రక్షింపబడాలో అక్కడ పరమాత్మ ఉండాలి. కాబట్టి శ్రీకృష్ణుడు పాండవపక్షంలోనే ఉండవలసి వస్తుంది. శ్రీకృష్ణుడు పాండవులకు బంధువు, స్నేహితుడు, అన్నిటిని మించి దైవం. దిక్కులేనివారికి దేవుడే దిక్కు అన్నట్లు తమ తండ్రి నిన్ను

దిక్కుగా చూపివెళ్లాడని ధర్మరాజు శ్రీకృష్ణుడితో అంటాడు.

'ఆపదఁ గడవం బెట్టఁగ, నోపి శుభంబైనదాని నొడఁగూర్పను మా
కీ పుట్టువునకుఁబాండు, క్ష్మాపాలుఁడు నిన్నుఁజూపి చనియె మహాత్మా'

అని ఉద్యోగ పర్వంలోను, 'దుఃఖామర్ష మహార్ణవ మగ్నులమైన మమ్ముం దీరంబు సేరుపం దేపవు నీవుకావె' అని ద్రోణపర్వంలోను ధర్మరాజు శ్రీకృష్ణునితో చెప్పిన మాటలు అర్థవంతాలు. శ్రీకృష్ణుని శక్తియుక్తులు, దివ్యచేష్టితాలు, కౌరవుల కందరికీ కాకపోయినా భీష్మ ద్రోణులకు బాగా తెలుసు. కడకు ధృతరాష్ట్రునికి కూడా ఈ విషయంలో శ్రీకృష్ణుని శక్తిమీద ఎంతో నమ్మకముంది. యుద్ధ సందర్భాలలో ఒకరోజు 'కృష్ణార్జునుల రథం ఎక్కడికి చొరబడినా దానికి తిరుగే ఉండదు' అని ధృతరాష్ట్రుడే సంజయుడితో అంటాడు. సమకాలం వాళ్లలో శ్రీకృష్ణుడు దివ్యుడైన అవతారపురుషుడని ఎక్కువమందికి తెలుసు. భౌతికబలాన్ని ఎక్కువగా ఊహించుకొనే దుర్యోధనాదులకు ఆయన దివ్యత్వం అర్థంకాలేదు. ఈ సందర్భంలో ధృతరాష్ట్రుడు సంజయుడితో చెప్పిన మాటలు ఈ పద్యంలో (ద్రోణ. 1-97) ఉన్నాయి.

మ. 'యదువంశంబున లోకరక్షణ పరుండై పుట్టి, వ్రేపల్లెను
న్నద బాల్యంబు నటించి, కంసముఖ నానా దైతుల్యంద్రుంచి బ
ల్లిదుఁడా యింద్రుని పారిజాతమిలకున్ లీలాగతిం దెచ్చి శి
ష్ట దయాళుత్వము పూనియున్న హరినిష్ఠం జెంది రప్పాండవుల్.'

ఈ పద్యంలో శ్రీకృష్ణావతార తత్త్వం పూర్తిగా చూపబడింది. లోకరక్షణ, బాల్యంబు నటించి, దైత్యులంద్రుంచి, లీలాగతిం దెచ్చి, శిష్ట దయాళుత్వము, హరినిష్ఠ - ఈ పదాలన్నీ సాభిప్రాయాలు. ఎప్పుడూ అసూయతోను, మాత్సర్యంతోను పాండవులను ద్వేషభావంతో చూసే

అంధరాజు శ్రీకృష్ణునిలో ఇన్ని విశేషాలు గుర్తించడం అవసానదశలో చేకూరిన ఆయన పుణ్యపరిపాకం తప్ప మరొకటి కారణం కాదు.

శ్రీకృష్ణుడు దివ్యకార్యాలు సమకాలంలో నిర్వర్తించిన అవతార పురుషుడైనప్పటికీ కొన్ని సందర్భాల్లో సాధారణ మానవుడుగా ప్రవర్తించిన తీరులు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ఆయన రాజుగా పాలించకపోయినా రాచమర్యాదలన్నీ తెలిసిన రాజనీతిజ్ఞుడు . పాండవులలో ధర్మరాజు వయసు దృష్టితో శ్రీకృష్ణుడి కంటె పెద్దవాడు. ధర్మరాజును ఆయన ఎప్పుడు పిలిచినా, మాట్లాడినా రాజును సంబోధించిన విధంగానే సంబోధించేవాడు. కర్ణుని వధించకుండా శిబిరానికి వచ్చిన అర్జునుని ధర్మరాజు విపరీతపు మాటలతో గట్టిగా అరుస్తాడు. 'నాటోటి పిరికి పందకు, ఆయుధాలు పట్టే శరీరదార్ఢ్యం లేనివానికి పట్టాభిషేకం వద్దు, భీముడికి పట్టం కట్టమని ' చెప్పి 'వనవాస గమనోన్ముఖుండైన, గనుంగొని కమలనాభుండా భూపతి చరణంబులకుం బ్రణుతుండై' పట్టాభిషేకానికి సమ్మతించమని ప్రాధేయపడ్డాడు. దీన్ని బట్టి శ్రీకృష్ణుడు అవసరమైనప్పుడు ఎంత వినయంగా నమస్కరించి కూడా పనులు చక్కబెడతాడనే విషయం కనపడుతుంది. కర్ణుడి చేతిలో ఘటోత్కచుడు మరణించినపుడు శ్రీకృష్ణుడు సంతోషించిన సందర్భాన్ని గమనిస్తే ఆయన మనస్తత్వం చక్కగా అర్థమవుతుంది. అవతార ప్రయోజనం నెరవేర్చడానికి శ్రీకృష్ణుడు ఎంత తీవ్రంగా నైనా ప్రయత్నించే విషయం తెలుస్తుంది.

కర్ణుడు అర్జునుని కోసం దాచి ఉంచుకొన్న శక్త్యాయుధాన్ని ఘటోత్కచుని మీద ప్రయోగించాడు. దానితో అమితబలుడైన భీమ తనయుడు అసువులు కోల్పోతాడు. ఆ సందర్భంలో కృష్ణుడు విపరీతంగా సంతోషించినట్లు తిక్కన చెప్పిన కింది మాటలను గమనిస్తే అర్థమవుతుంది. "గోవిందుడు ప్రమోదంబు నొంది, సింహనాదంబుచేసి శంఖంబు పూరించి, పగ్గంబులు నొగల ముడిచి మందమారుతాందోళితంబగు మందారంబు

దోఁప నర్తించుచు అరదంబు నడిమి తిరిగి కిరీటిం గౌఁగిలించుకొని వీఁపప్పళించి వెండియు నార్చిన" (ద్రోణ. 5-237) శ్రీకృష్ణుడు సంతోషంతో నృత్యం చేస్తుంటే మందారవృక్షం మందమారుతానికి అల్లసల్లన కదిలి ఆడుతూ ఉంటే ఎలా ఉంటుందో అలా ఉండట. అర్జునుని ఆలింగనం చేసుకొని వెన్ను చరిచి మళ్లీ సింహనాదం చేశాడట. ఘటోత్కచుని మరణానికి అందరం దుఃఖిస్తుంటే 'మీరెందుకు సంతోషపడుతున్నార'ని అర్జునుడు అడిగాడు. దానికి శ్రీకృష్ణుడు చెప్పిన సమాధానం అవతారతత్త్వాన్ని ప్రకటించేదిగా ఉంది. ఆయన చెప్పిన విషయాలు - **1.** శక్తి అనే ఆయుధం కర్ణుడి దగ్గర ఉన్నంత కాలం నాకు నిన్ను బతికించుకోవడం అసాధ్యంగా ఉంటుంది. ఇప్పుడు ఆ ఆయుధం ఘటోత్కచుని మీద ప్రయోగింపబడడంతో కర్ణుడికి అది లేకుండా పోయింది. అందుకే నాకు సంతోషంగా ఉంది. ఆ శక్త్యాయుధం కర్ణుడి దగ్గర ఉంటే నేను సుదర్శన చక్రాన్ని, నీవు గాండీవాన్ని ధరించి ఏకమై ఎదిరించినా ఆ కర్ణుడు మనలనిద్దరినీ జయిస్తాడు. మీ తండ్రి ఇంద్రుడు నీ కోసం కర్ణుడి కవచ కుండలాలను వేరుచేయకపోయినట్లతే అతనికి ఎదురుగా నిలిచే వాడెవ్వడూ ఉండడు. **2.** "అర్జునా ! నీకోసం ఏకలవ్యుడు, శిశుపాలుడు, జరాసంధుడు మొదలైన వారిని ఒక్కొక్కరిని ఒక్కొక్క విధంగా హతమార్చాను. ఒకవేళ వాళ్లందరూ ఈ సమయంలో జీవించి ఉన్నట్లయితే దుర్యోధనుడు వాళ్లను తనకు సహాయంగా తెచ్చుకొనేవాడు. ఆ ఏకలవ్యాదులు ముగ్గురూ కలసి యుద్ధం చేస్తే వారిని ఎవరూ ఎదిరించలేరు". **3.** ఈ ఘటోత్కచుడు కిమ్మీరాదులవలె మరణించడం నాకు ఇష్టమే. ఘటోత్కచుడు రావణాసురుని వంటివాడు. ఒకవేళ ఈ సమయంలో మరణించకుండా ఉంటే తరువాత నేనే స్వయంగా సంహరించవలసి వచ్చేది. **4.** అందుకే నాకిది సంతోష సమయం. ఈ యథార్థాన్ని గమనించి నీవు విచారించకుండా యుద్ధం మీద ఉత్సాహం పెంచుకో." (కర్ణ 5-239వ వచనం).

సుఖము

– శ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు

ఈ విశ్వములో సకలజీవులు – అంటే సృష్టికర్త ఐన బ్రహ్మదేవుడు మొదలుకుని పిపీలికము అంటే చీమ వరకు అందరూ ఎల్లప్పుడూ సుఖంగా వుండాలనే కోరుకుంటారు. దానికోసము జీవితాంతమూ ప్రయత్నాలను కూడా చేస్తూంటారు. ప్రయత్నాలను చేస్తూనే వుంటారు అన్న మాటను కాస్త పరిశీలిస్తే ఏమిటి అర్థమౌతుంది ? సుఖమనేది దొరకటము లేదు, లేదా సంపాదించిన సుఖము అంతమై పోతున్నది, లేక అనేకరకాలైన సుఖాలు కావలిసి వస్తున్నాయి అని తేలుతుంది. జీవులు కోరుకునేదీ అనుభవించేదీ ఐన సుఖానికి ఈ మూడు అవ లక్షణాలు అంటే దొరక్కపోవటము, అంతమై పోవటము, అనేక రకాలైనవి కావలిసి రావటము అనేవి వున్నాయి. అందుచేత జీవికి ఏతాదృశమైన సుఖము కొరకు నిరంతర ప్రయత్నాల చేత శ్రమనే తప్ప ఎల్లప్పుడూ సుఖంగా వుందామనే లక్ష్యము ఎన్నటికీ సిద్ధించదు అని స్పష్టమౌతున్నది. ఎన్నటికీ అంటే ఎన్ని లక్షల లేక కోట్ల జన్మలెత్తినా గానీ అని అర్థము.

నిజానికి సుఖము అంటే ఏమిటి ? మనసుకు తను ఆశించినది అంటే ఇష్టమైన వస్తువు, లేక విషయము, ఇష్టమైన సమయానికి, ఇష్టమైన ప్రమాణంలో, ఇష్టమైన వ్యక్తి ద్వారా, ఇష్టమైన స్థలంలో, ఇష్టమైన విధంగా ప్రాప్తించినప్పుడు దానికి కలిగే నిశ్చలస్థితికే సుఖము అని పేరు. ఉదాహరణకు –దాహము తీర్చుకొనడానికి మంచినీరు అవసరమైంది ఒక వ్యక్తికి. దాహము కలిగిన సమయంలో, వేసవికాలమైతేచల్లటి నీరు, దాహం తీరడానికి సరిపడినన్ని నీళ్ళు, నచ్చిన వ్యక్తి ఇచ్చినప్పుడు, ఉచితస్థలంలో ఇచ్చినప్పుడు, స్వచ్ఛమైన

నీరు, స్వచ్ఛమైన పాత్ర, గౌరవప్రదంగా లభించినప్పుడు మాత్రమే ఆ వ్యక్తి సంతోషిస్తాడు. లేదా సంతోషము నాస్తి. సంతోషము అంటే మనసుకు కలిగిన సుఖాన్ని వ్యక్తపరిచే ముఖ లక్షణాలు, సంజ్ఞలు, మాటలు మొదలైనవి అని అర్థము. ఒక్క త్రాగే మంచినీటి సుఖానికే ఇన్ని విధాలైన ప్రతి బంధకాలు వుంటే ఇక మనిషి కోరుకునే దాంపత్య పుత్రమిత్ర బంధు ధనకనక వస్తువాహన పదవి గృహ క్షేత్రాది సంబంధమైన సుఖప్రాప్తిని ఏమని చెప్పాలి ? ఇటువంటి ప్రతిబంధకాలేవీ లేనటువంటి సుఖము లభించడమన్నది అసంభవమే గదా! సారాంశము ఏమిటంటే – ప్రాపంచికమైన వేటితో గూడా ఎల్లప్పుడూ సుఖంగా ఉండటమన్నది అసాధ్యము అన్నది.

ఇక వస్తు సుఖానికి మరొక దోష మున్నది. అది అస్థిరత్వము – అంటే ఆ వస్తువు వలన కలిగిన సుఖము అంతమైపోతుంది అని. ఉదాహరణకు చాలా సంతృప్తికరమైన భోజనము లభించింది. ఐతే ఆ సుఖము ప్రతి నిమిషానికీ తగ్గిపోతూ రెండు మూడు గంటల కాలం తరువాత నశించిపోయి స్మృతి మాత్ర సుఖంగా మిగిలిపోతుంది. దురదృష్టవశాత్తు ఆ భోజనము శరీరానికి సరిపడనిదైతే దుఃఖముగానే మారిపోతుంది. అదేవిధంగా ఉత్తమశ్రేణి విద్యా పట్టాలు, గొప్ప పదవులు, వివాహము, అద్భుతమైన గృహము, విలువైన వాహనము, స్వర్ణాభరణాలు ఇత్యాదుల ప్రాప్తి వలన లభించిన సుఖము కాలగతిలో మెరుగైపోతున్న విషయము సర్వజనానుభవమే గదా ! ఈ సత్యాన్నే భగవానుడు బోధించాడు.

“మాత్రా స్పర్శాస్తు కౌంతేయ ! శీతోష్ణ సుఖదుఃఖదాః

ఆగమాపాయినో ౽ నిత్యాః తాంస్తితిక్షస్వ భారత ! (భగవద్గీత 2-14

ఈ విధంగా వస్తుసుఖము ఎందుకు అంతమైపోతున్నది ? మొదటిది

– ప్రకృతిలోని వస్తువులన్నీ గూడా షడ్భావవికారాలకు వశమైనవే. పుట్టుక, ఉండుట, పెరుగుట,మారుట, క్షీణించుట, నశించుట అన్నవే ఆ వికారాలు.అంటే మార్పులు. ఈ మార్పులకు లోబడినవి అవటము వలన వస్తువులు మనసుకు సర్వదా సుఖాన్ని ఇవ్వజాలవు. అంతేగాక మనసు యొక్క స్వభావమైన చంచలత్వము వలన అది ఒకే వస్తువును సర్వదా ఇష్టపడదు, అది నిరంతరము నూతన విషయాలను కోరుకుంటుంది. కాబట్టి విషయ సుఖానికి నాశనము అనివార్యము. మరొక సత్యము – విషయాలు అందుబాటులో వున్నా కూడా శరీరము అనారోగ్యము, వృద్ధాప్యము ఇత్యాదుల వల్ల అనుకూలము లేనప్పుడు గూడా మనసుకు సుఖము లభించదు.

కఠోపనిషత్తులో విషయసుఖాల తృణీకరణము తెలియబరచ బడింది. శత సంవత్సరాల ఆయుర్దాయం గల పుత్రపౌత్రులు, పశువులు, అశ్వాలు, సువర్ణము గల రాజ్యము, జీవించాలి అనుకున్నంత కాలము ఆయుర్దాయము, ఆరోగ్యము, రథాలు వాయిద్యాలతో గూడి కోరిన పరిచర్యలను చేసే అప్సరసలు అనేవి వరంగా ఇస్తానని యమధర్మరాజు నచికేతుడనే బ్రాహ్మణ బాలకుడిని మోహపెట్టినా అతడు వాటిని నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తాడు. అంత విశేషమైన విషయ సుఖావకాశాన్ని గూడా నశ్వరమైనదని గ్రహించిన వివేకి తప్ప మరొకరు ఎట్లా తృణీకరించగలరు?

నశ్వరమైన విషయ సుఖాలు సంపాదించాలన్నా గూడా దీర్ఘకాల కృషి, ధనవ్యయము, పట్టుదల, ఆలోచన ఇత్యాదులు చాలా అవసరము. చిరకాల సాధ్యాలైన ధనసంపాదన విద్యలు, ఉద్యోగాలు, వాణిజ్యము, వృత్తులు, వ్యవసాయము ఇత్యాదులు ధనప్రయాసలకు లోనైవే గదా!

వీటిని వదలి అధర్మ ప్రవృత్తి చేత సాధించబడిన విషయ సుఖాలు తప్పనిసరిగా ఘోరమైన నరక యాతనలను గూడా ప్రాప్తింప జేస్తాయి.

ఇక ఇప్పుడు మనసుకు సుఖమన్నది ఎక్కడి నుండి కలుగుతున్నది అన్న రహస్యాన్ని విచారిద్దాము – ప్రతిప్రాణి మనసు హృదయము (అంతఃకరణము) లోపల ప్రత్యగాత్మ, కూటస్థుడు, ఉపద్రష్ట ఇత్యాది నామాలతో పరమాత్మనే ఉన్నాడు. ఆనందము అన్నది పరమాత్మ యొక్క ఉపలక్షణము. ఆ ఆనందము స్థిరమైనది, స్వతంత్రము (మరొక వస్తువు మీద ఆధారపడనిది), సిద్ధంగా వున్నదీ అంటే దాన్ని సంపాదించనక్కరలేదు, అంతము లేనిది, నిరతిశయమైనది – అంటే దానికంటే ఎక్కువ ఆనందమన్నది లేదు అని అర్థము. మనసు అనుభవించే ఏ సుఖానికైనా ఆ ఆనందమే మూలము. ప్రపంచంలోని అన్ని నీటివనరులకూ సముద్రమే మూలము గదా! ఆ విధంగా అన్నమాట. మనసులో రజోగుణ తమోగుణాల ఆధిక్యము కలిగినప్పుడు దానిలోని ఆత్మానందము మరుగున పడిపోతుంది. కాగితము బాగా కదులుతున్నప్పుడు దానిలోని విషయాన్ని చదివే వీలుపడదు గదా! కాగితము మీద కాంతి బాగా తక్కువగా వున్నప్పుడు గూడా దానిలోని విషయము గ్రహించడానికి వీలుపడదు గదా! ఆ విధంగా రజస్తమోగుణాలు మనసును చంచలత్వానికీ అలసత్వానికీ గురిచేసి దాన్ని ఆనందం నుండి దూరం చేస్తాయి. సత్త్వగుణము ఎక్కువగా వున్నప్పుడు మనసు నిశ్చలమై ప్రకాశవంతంగా వుండి తనలోని ఆత్మానందాన్ని కొంత అనుభవించ గలుగుతుంది. కోరుకున్న విషయాలు వస్తువులు లభించినప్పుడు సత్త్వగుణం పెరిగి చంచలత్వము తగ్గి తత్ఫలితంగా మనసు ఆనందం అనుభవిస్తుంది. సత్యము తెలియనందు వలన ఆ సుఖము ఆ వస్తువుల నుండి లభించిందని అది భ్రమిస్తుంది. ఐతే ఇంతకు ముందు తెలిపిన వస్తుదోషాలు, మనస్సు స్వభావం కారణంగా అచిరకాలంలోనే ఆ విషయ సుఖము అంతమై

పోతుంది. సత్త్వగుణం వలన సుఖము కలుగుతుందనీ దాన్ని పెంచే సత్కర్మను ఆచరించమని శాస్త్రము బోధిస్తున్నది. దాన ధర్మాలు, తీర్థయాత్రలు, దైవారాధన, నిత్యనైమిత్తిక కర్మలు, సత్‌గ్రంథపఠనము శ్రవణము, భగవన్నామ సంకీర్తన, భజన, జ్ఞానులసేవ ఇత్యాదులన్నీ సత్కర్మలు.

"యత్తదగ్రే విషమివ పరిణామే ౽ మృతోపమమ్

తత్సుఖం సాత్త్వికం ప్రోక్త మాత్మ బుద్ధి ప్రసాదజమ్" (భగవద్గీత 18-37)

ఆత్మవైపు తిరిగిన నిర్మలమైన బుద్ధి ద్వారా సాత్త్విక సుఖము కలుగుతుందని భావము.

చివరగా మనసు యొక్క నిమిత్తము లేకుండా నేరుగా జీవియొక్క స్వరూపమైన ఆత్మానందాన్ని చేరుకొనడానికే భగవద్గీత మార్గాన్ని ఉపదేశించింది.

"ప్రశాంతమనసం హ్యేనం యోగినం సుఖముత్తమమ్

ఉపైతి శాంతరజసం బ్రహ్మభూత మకల్మషమ్" - (భగవద్గీత 6-27)

మనసును జయించి పరమాత్మ స్థితిని పొందిన యోగిని ఉత్తమమైన సుఖము (ఆత్మానందము) పొందుతుంది అని భావము.

కాబట్టి సుఖమన్నది బాహ్య విషయాలు, వస్తువులలో లేదనీ, తానే సుఖానికి మూలమనీ బాగా గ్రహించిన వివేకవంతుడే వాటి వెంటపడి యాతన ననుభవించకుండా ఆనందమాత్రుడుగా వుండటానికే తీవ్రమైన సాధనను చేస్తాడు. జ్ఞానులూ, తత్త్వ దర్శనులూ ఐన సద్గురువులను ఆశ్రయించి వారి ఉపదేశానుసారము సాంఖ్యయోగాభ్యాసాలను చేసేవారు సుఖసంపాదన వేట ఐన సంసారము నుండి ముక్తులై స్వరూపానంద

స్థితిని చేరి శాశ్వతంగా దానిలో వుండగలరు.

పురాణాల ద్వారా తెలుపబడిన కర్దమ ప్రజాపతి, ధ్రువుడు, భరతుడు, అంబరీషుడు, యయాతి మొదలైన చక్రవర్తులందరూ తమకు గల అపార విషయ భోగాలను స్వచ్ఛందంగా త్యజించి వనవాసం చేసి నిత్యానంద స్థితిని చేరుకున్నారు. అదే వివేకవంతులందరికీ ఆదర్శము.

ఓం తత్ సత్

సదుపదేశాలు

– శ్రీ రామకృష్ణ పరమహంస

1. చక్కగా సాగు చేయబడ్డ నేలలో విత్తనాలు సులువుగా అంకురించునట్లు. నిష్కపటచిత్తుడి మృదుల హృదయంలో భక్తిబీజాలు చక్కగా నాటుకొని ఫలవంతమౌతాయి.

2. సత్యం పలకడమే కలియుగంలో తపస్సు, కలియుగంలో ఇతర తపస్సులు చేయడం ఎంతో కష్టం. సత్యాన్ని అంటిపెట్టుకొని ఉంటే భగవంతుణ్ణి పొందగలం.

3. భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోవడానికి తీవ్ర వైరాగ్యం ఉండాలన్నది నిశ్చయం. భగవన్మార్గంలో అవరోధాలుగా తోచే వాటిని తక్షణమే పరిత్యజించాలి. తరువాత చూచుకోవచ్చునులే అని వాయిదాలు వేసుకోవడం మంచిదికాదు.

4. భగవంతుడి కోసం సాధనలు చేసే నిమిత్తం ఈ మానవ జన్మ లభించింది. భగవంతుని పాదపద్మాలపై భక్తిని పెంపొందించుకొనేందుకు ప్రయత్నించాలి. నిరర్థక విషయాలలతో పని ఏమిటి?

5. భగవంతుణ్ణి ప్రార్థించేటప్పుడు కేవలం ఆయన పాదపద్మాలపట్ల భక్తిని మాత్రమే కోరు. అహల్యశాప విమోచనం తరువాత శ్రీరాముడు ఆమెను ఏదైనా వరంకోరుకొనమన్నాడు. అప్పుడు అహల్య రాముణ్ణి 'ఓ రామా! నేను పందిగా జన్మించినా పరవా లేదు. కానీ నీ పాదపద్మాలపై పట్ల నా మనస్సు లగ్నమయ్యేలా మాత్రం అనుగ్రహించు' అని వేడుకొన్నది.

6. మానవుడు తన కోరికలను సంపూర్ణంగా భగవంతుడి పరం చేసిననాడు భగవత్కటాక్షాన్నీ శాన్తినీ పొందుతాడు.

అన్నమయ్య - శరణాగతి

- డా॥ నముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

మోక్షమనే సౌధం నాలుగు స్తంభాలపై ఆధారపడి యున్నది. ఆ స్తంభాలే కర్మ- భక్తి- ధ్యాన- జ్ఞానయోగాలు. ముక్తి అనే కామధేనువు కర్మయోగం మున్నగు నాలుగు పాదాలపై నిలబడి వున్నదని గూడ చెప్పవచ్చు.

అయితే పైన పేర్కొన్న నాలుగు యోగాలలో ఒక్కొక్క యోగానికి ఒక్కొక్క కాలంలో క్షీణదశ సంభవించవచ్చు. ఆ దుర్దశను తొలగించి పూర్వస్థితిని కల్గించడానికై భగవదంశ సంభూతులైన మహాపురుషులవతరిస్తారు. వారు ఆయా కాలాలలో ఆయా యోగాల ప్రాముఖ్యాన్ని ఆచరణ పూర్వకంగా ప్రజలలో ప్రచారం చేస్తారు. ఎనిమిదవ శతాబ్దంలో కేరళలో అవతరించిన శ్రీ శంకర భగవత్పాదులు జ్ఞానయోగ ప్రాముఖ్యాన్ని ప్రతిపాదించారు. తరువాత తమిళ దేశంలో అవతరించిన శ్రీ భగవద్రామానుజులవారు భక్తి ప్రాముఖ్యాన్నీ - అందులోనూ శరణాగతి ప్రాధాన్యాన్నీ నొక్కి వక్కాణించారు. వారి అనుయాయులు తమ తమ ఆచార్యులు ప్రతిపాదించిన యోగాలను అధ్యయనం, ప్రబోధం, ఆచరణం, ప్రచారణమనే నాలుగు మార్గాలతో విస్తరింప జేశారు.

ప్రజలలో భక్తి ప్రపత్తులను ముమ్మరంగా ప్రచారం చేసిన వారు శ్రీరామానుజులు కాగా వారి సదాశయాలను తరువాత అనేక విధాల ప్రచారంలోకి వారి శిష్యులు తెచ్చారు. అట్టి మహనీయులలో పదకవితా పితామహుడు, ప్రథమ వాగ్గేయకారుడు, సంకీర్తనాచార్యుడు- అన్నమాచార్యుడు అగ్రగణ్యుడు.

నేటి కడప జిల్లాలోని రాజంపేటకు సమీపంలో ఉన్న తాళ్ళపాక గ్రామంలో 1408లో అన్నమయ్య అవతరించాడు. 1424లో ఆయన జన్మించాడని కొందరంటారు. ఆయన తల్లిదండ్రులు లక్కమాంబ - నారాయణ సూరి అనేవారు. శ్రీమన్నారాయణుని నందకాంశంలో అన్నమయ్య జన్మించాడని ప్రతీతి.

పసిబిడ్డగా ఉన్నప్పుడే తిరుమలప్ప ప్రసాదమని చెప్పకపోతే ఆయన ఉగ్గు గూడా త్రాగేవాడు కాడట! స్వామిపై జోలలు పాడకుంటే నిద్రించేవాడు కాడట !

ఎనిమిదేండ్ల వయస్సులో ఇంటి పెద్దల ఆదేశానుసారం కొడవలి చేపట్టి అన్నమయ్య గడ్డికోసుకు రావడానికి పొలానికి వెళ్ళాడు. చేతివ్రేలు తెగింది. "హరి హరి" అంటూ భగవంతుని స్మరించాడు. విరక్తుడై తిరుమలకు వెళ్ళే యాత్రికుల వెంట బయలుదేరాడు. తిరుమల నధిరోహించాడు. మోకాళ్ళ పర్వతం చెంత ఆకలితో అలసిపోయాడు. కాలి చెప్పులతో అలాగే పడి నిద్రించాడు.

అలిమేలు మంగమ్మ అతని అలసట గుర్తించి దగ్గఱకు వచ్చి లేచిరమ్మన్నది. ఆమె కృపతో ఆయన అలసట తీరింది. 'సాలగ్రామపర్వతమైన తిరుమలను కాలి చెప్పులతో ఎక్కరాదు సుమా !"అని ఆ దేవి హెచ్చరించింది. అప్పుడు అన్నమయ్యకు ఆ కొండ భగవత్స్వరూపంగా గోచరించింది. ప్రసాదాన్నంతో ఆ దేవి అతని ఆకలి తీర్చింది. అతని నోట ఆశువుగా అప్పుడే దేవి మీద ఒక శతకం వెలువడింది.

తదుపరి అన్నమయ్య గుడికి వెళ్ళాడు. తలుపులు మూసి వున్నాయి. అప్పుడు ఆ దేవునికి ఒక శతకం విన్నవించేసరికి తాళాలు ఊడిపడ్డాయి. కూటాలు తెరచుకొన్నాయి. అర్చకుడు ఆశ్చర్య చకితుడై తీర్థ ప్రసాదాలు

ఇచ్చాడు. ఆ రాత్రి కలలో కనిపించి స్వామి ఆదేశించినట్లే మరునాడు ఘనవిష్ణువు అనే ముని అన్నమయ్యకు పంచసంస్కారాలు నిర్వర్తించాడు.

పిదప అన్నమయ్య తాళ్ళపాకకు తరలివచ్చాడు. పెళ్ళీడు రాగానే తిరుమలమ్మ, అక్కలమ్మ అనే ఇద్దరు కన్యలతో ఆయనకు వివాహం జరిగింది. సంసారం సాగిస్తూనే మహాభక్తి సంపన్నుడై భక్తిరసభరితాలైన వేలకొలది సంకీర్తనలతో భగవానుణ్ణి కీర్తిస్తూ కాలం గడిపాడు. ప్రజలు ఆయనను నారదుడో, తుంబురుడో అని భావించారు. ఆయన కీర్తి దశ దిశలా విస్తరిల్లింది. సాళువ నరసింగరాయలు మున్నగు రాజులు ఆయన భక్తి భావాన్నీ, కవితా వైభవాన్నీ గుర్తించి అసామాన్య రీతిలో గౌరవించారు.

ముప్పది రెండు వేల సంకీర్తనలతో అన్నమయ్య శ్రీ వేంకటేశ్వర స్వామిని కీర్తించాడని ఆయన మనుమడు చిన్నన్న రచించిన అన్నమయ్య జీవితచరిత్రనుండి తెలుస్తున్నది. అవే కాక ద్విపద రామాయణం, వేంకటాద్రిమాహాత్మ్యం, శృంగారమంజరి, పెక్కుశతకాలు అన్నమయ్య రచనలుగా వినుతి కెక్కాయని పై జీవితచరిత్ర నుండి తెలుస్తున్నది.

అన్నమయ్య తరువాతి కాలంలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ, శ్రీహత్తీరాం బావాజీ, శ్రీ సద్గురు మలయాళస్వామి - వీరు తిరుమలలో వుంటూ అక్కడి స్వామిని కీర్తిస్తూ ఆ దేవునికి శరణాగతులై లోక పూజ్యులయ్యారు.

శైలే శైలే న మాణిక్యం, చందనం న వనేవనే ।
సాధవో న హి సర్వత్ర మౌక్తికం న గజే గజే ॥

తా ॥ ప్రతి పర్వతము నందు (శైలమునందు) మణులుండవు. ప్రతి అడవి యందు మంచి గంధపు చెట్లుండవు. ప్రతి ఏనుగు కుంభస్థలంలో ముత్యములుండవు. అట్లే అన్ని చోట్ల సాధుపురుషులు లభింపరు.

హరిదాస సంప్రదాయు - శ్రీకృష్ణుడు

- ఆచార్య కె.నరోత్తమరావు (తిరుపతి)

కన్నడ వాఙ్మయంలో వీరశైవ సాహిత్యం తరువాత హరిదాస సాహిత్యానికే ఎనలేని ప్రాధాన్యం, ప్రాచుర్యం. ఈ ప్రాధాన్య ప్రాచుర్యాలు కనిపించడానికి హరిదాసుల దీక్షాజీవన విధానం, సరళశైలిలో సామాన్యులు అవగతం చేసుకొనేలా కీర్తనలు పాడడం, భక్తి ఒక్కటే ముక్తికి సాధనమని ప్రచారం చేయడం కొన్ని కారణాలు.

హరిదాస సాహిత్యం 'ద్వైత' సిద్ధాంతాలకు దగ్గరిది. శంకర రామానుజుల తరువాత సమాజంలో నైతికతకు, హరిభక్తికి పట్టం కట్టినవారు హరిదాసులు. అంతేగాక మహావిష్ణువు అవతారాలలో శ్రీకృష్ణావతారానికి ముగ్ధులై కృష్ణభక్తి ఒకటే శరణ్యమని ప్రచారం చేసినవారు. ఈ ప్రచారానికి మరికొన్ని కారణాలున్నా ద్వైతమత స్థాపకులయిన మధ్వాచార్యుల జీవనంలోని ఒక సన్నివేశం ప్రధానకారణం కూడా కావచ్చు.

మధ్వాచార్యులు - శ్రీకృష్ణ విగ్రహం :

మధ్వాచార్యులు ఒకనాడు సాగరతీరాన అనుష్ఠానం కొనసాగిస్తుంటే ఎవరూ ఊహించనివిధంగా సముద్రంలో తుఫాను రేగింది. వాతావరణ మంతా అతలాకుతలమయింది. ఆ తుఫాను వేగానికి ఒక నావ ఊగిసలాడింది. నావ మునిగిపోతుందేమోనని నావయజమాని దిగాలుపడ్డాడు. ఈ విపత్కర పరిస్థితిని వీక్షిస్తున్న మధ్వాచార్యులు కరుణాహృదయులై తన భుజం మీది కాషాయ వస్త్రాన్ని చేతబట్టి గాలిలో 'అటు ఇటూ' ఊపారట.

ఆపై ఒక్క క్షణానికే సర్వం శాంతించింది. నావ యజమాని ఆశ్చర్యపడ్డాడు. నావ ఒడ్డుకు క్షేమంగా చేరింది. నావ యజమాని

పరుగెడుతూ వచ్చి ఆచార్యులకు పాదాభివందనం చేశాడు. అంతే కాదు కృతజ్ఞతతో అమూల్యమయిన కానుకలను ఇవ్వబోయాడు. ఆచార్యులవారు సున్నితంగా వారించారు. యజమాని మరీ మరి బతిమాలుతుంటే నావలోని "గోపిచందనరాశి" ఇస్తే చాలన్నారు. నావ యజమాని తెల్లబోయాడు. తన నావలో 'గోపిచందనరాశి' ఎలా వచ్చిందో తేల్చుకోలేక తలపట్టు కొన్నాడు. చివరకు నావలో ఒకచోట 'రాశిని' గుర్తించి అద్దానిని ఆచార్యుల వారికి అర్పించాడు. ఆచార్యులవారు ఆ గోపీచందనరాశిని శుద్ధి చేస్తుంటే ఆ రాశి నుండి మనోహరాకారమయిన శ్రీకృష్ణవిగ్రహం ఆవిర్భవించింది. శిష్యులు తెల్లబోయారు. ఆచార్యులవారు ఆ శ్రీకృష్ణవిగ్రహాన్ని ఎత్తుకొని భక్తిపారవశ్యంతో స్తోత్రం చేశారు. ఆ స్తోత్రమ్ 'ద్వాదశ స్తోత్రం. ఒక్కొక్క అధ్యాయం ఒక్కొక్క ఛందో రీతిలో సాగినరచన. నేటికీ ఆలయాలలో ఆ స్తోత్రాన్ని చదవడమో లేదా జేగంటతో వాయించడమో సంప్రదాయంగా ఉంది. ఈ సన్నివేశం వల్ల 'ఉడుపిక్షేత్రం మాధ్వులకు పరమపావన క్షేత్రమయింది. శ్రీకృష్ణ భక్తులు సేవించే క్షేత్రాలలో 'ఒకటిగా' స్థిరపడింది. మధ్వాచార్యులు స్థాపించిన ద్వైతమతాన్ని ప్రచారం చేసిన హరిదాసులకు కూడా 'శ్రీకృష్ణుడు' ఆరాధ్యమూర్తి అయ్యాడు.

అష్ట మఠాలలో శ్రీకృష్ణ విగ్రహం' : మధ్వాచార్యులు 'ఉడుపి' క్షేత్రంలో శ్రీకృష్ణవిగ్రహం ప్రతిష్ఠ చేశాక అక్కడ పూజాదికాలు సవ్యంగా జరగడానికి అష్టమఠాలు స్థాపించారు. పర్యాయక్రమంలో పూజాదులు జరిగేలాగున కట్టడి చేశారు. ఆ ఎనిమిది మఠాలలో ఒకటయిన 'అదమూరు మఠంలో' ఆరాధ్య దైవం 'కాళీయ మర్దన కృష్ణుడు'. మరొక మఠమైన 'కృష్ణ మఠంలోను' కాళీయ మర్దన కృష్ణుడే ఆరాధ్యదైవం. హరిదాసుల రచనలలో తాండవ కృష్ణ కీర్తనలు ఎక్కువగా కనబడడానికి ఈ మఠాలలోని మూర్తుల దర్శనం ఒక కారణం.

పండరీపురంలోని స్వామి 'విఠలుడు' పాండురంగడు. పాండురంగ విఠలుడు విష్ణువు అర్చావతార విగ్రహమే. ఆ స్వామి రుక్మిణీ వల్లభుడు, శ్రీకృష్ణుడు హరిదాసులకు ఆరాధ్యదైవం. 'విఠలుడు' అష్టమఠాలలో ఒకటయిన ఉత్తిరి మఠంలోను, సిరూరు మఠంలోను, పెజావరు మఠంలోను అర్చామూర్తి. ఈ దృష్టితో పరిశీలించినా హరిదాసుల శ్రీకృష్ణ ప్రీతి సువ్యక్తం.

హరిదాసుల పదాలలో 'మకుటం': హరిదాసుల రచనలను 'దేవరనామ గళు' అంటారు. ఈ దేవరనామగళు చివర 'మకుటం' ఒక నియమం. దీనిని కన్నడిగులు 'అంకితపద' మంటారు. ఈ అంకితపదం చాలవరకు గురువు శిష్యునికి అనుగ్రహించేది. హరిదాసుల దేవరనామగళు'లో విఠలాంకితం ఎక్కువయినా వ్యాసరాయల 'దేవరనామగళు'లో కృష్ణ - శ్రీకృష్ణ - సిరికృష్ణ -ముద్దుకృష్ణ అనే మకుటాలు ఎక్కువ కనిపిస్తాయి. భీమవ్వ పదాలలో 'భీమేశ కృష్ణ' ఒక మకుటం. ఈ దృష్టితో పరిశీలించినా హరిదాసుల 'కృష్ణభక్తి ' ప్రగాఢ మనక తప్పదు.

హరిదాసులలో పురందరదాసులవారి స్థానం పదిలం. పురందర దాసులవారి కాలం నుండి అంకిత పదాలలో కృష్ణ పర్యాయశబ్దమయిన "విఠల"కు ప్రాచుర్యం. రంగవిఠల, విజయ విఠల, వ్యాసవిఠల, శ్రీపతి విఠల, శ్రీనాథ విఠల, జగన్నాథ విఠల, గోపాల దాస విఠల, భీమేశ విఠల లాంటివి. ఈ అంకిత శబ్దాన్ని బట్టి హరిదాసుల 'కృష్ణ ప్రీతి' సుస్పష్ట మవుతుంది.

హరిదాసులలో ప్రముఖులు : హరిదాస'సంప్రదాయం ఎప్పటిదనడంలో అభిప్రాయ భేదాలున్నాయి. మధ్వాచార్యులకు పూర్వమే 'ఆధ్య సంప్రదాయం' ఉండేదని వారే తొలి హరిదాసులని ఒక వాదం. నరహరి తీర్థులు హరిదాసులలో మొదటివారని మరో వాదన. ఏది ఏమయినా వ్యాసరాయల కాలంలోనే దాసకూటానికి ప్రాధాన్యం పెరిగిందనడంలో మరోవాదం

లేదు. హరిదాసులు శతాధికులయినా వారిలో శ్రీపాదరాయ, త్యాగరాయ, పురందర దాసులు ప్రముఖులు. వీరి పదాలలో ఇతర దేవతల కృతులున్నా శ్రీకృష్ణస్తుతులు ఎక్కువ. వీరి రచనలకు భాగవతం, హరివంశం గ్రంథాలలోని కృష్ణకథలు ఆధారాలు. ఇంతేగాక హరిదాస సంప్రదాయంలో మహానుభావ పంథా, శ్రీరామానుజపంథా, విట్ఠల సంప్రదాయం అన్నీ కలిసి ఉండడం విశేషం.

స్థూలంగా పరిశీలిస్తే హరిదాసుల రచనలలో శ్రీకృష్ణుని బాల్యలీలలు, గోపికల విరహం, శ్రీకృష్ణుని ఆర్తత్రాణపరాయణత్వం శ్రీకృష్ణభక్తికి సులభోపాయాలుగా కనిపిస్తాయి. వీటిని ఆయా హరిదాసులు చాల రమ్యంగా హృదయాకర్షకంగా వర్ణించారు. అయినా వీరిలో మఠాధిపతులయినవారి శ్రీకృష్ణచిత్రణ కంటే ప్రజానీకం మధ్య నడయాడిన హరిదాసుల శ్రీకృష్ణచిత్రణ భిన్నమనక తప్పదు.

శ్రీపాదరాయల 'కృష్ణ చిత్రణ' : హరిదాస పరంపరలో 'శ్రీపాదరాయలు' మొదటివారు. వారు శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఉన్నవారే. వీరు సాళువ నరసింహరాయలు గౌరవించిన మఠాధిపతి, ఆలయాలలో తమిళులకున్న ప్రాధాన్యం గుర్తించి పూజాదికాలలో కన్నడ కీర్తనలకు ప్రాధాన్యం కల్పించిన ఘనత శ్రీపాదరాయలవారిదే. అన్నమయ్య పదరచనలకు శ్రీపాదరాయల 'దేవరనామగళు' నిర్మాణం మూలమని పుట్టపర్తి, రాళ్ళపల్లి వంటి విమర్శకుల అభిప్రాయం తిరుగులేని సత్యం. వీరి రచనలలో వేణుగీతె, గోపిగీతె భ్రమర గీతెలు పేరెన్నికగన్నవి. ఈ 'గీతెలలో' శ్రీపాదరాయలవారు భగవద్విరహాన్ని ప్రదర్శించినారని కొందరి అభిప్రాయం. మచ్చుకు ఒకటి రెండు కీర్తనల సారాంశం.

గోపికలు రేపల్లెకు అక్రూరుడు రావడం విన్నారు. వారితో కృష్ణుడు మధురానగరికి వెళతాడని తెలియగానే గోపికలు అవాక్కయ్యారు.

పరస్పరం గోపికలు ఈ అంశాన్ని చర్చించుకొంటూ ఉంటే కన్నయ్య అక్కడికి తానే వచ్చాడట. గోపికలను ఆశ్వాసించాడట. తాను కొద్ది రోజులలోనే తిరిగివస్తానన్నాడట. అయితే వారు నమ్మలేదు. చివరకు కృష్ణుడు 'బ్రహ్మ ఆన – మన్మథుడు అన' అని ఒట్టుపెట్టాడట. ఈ ఒట్టు వినగానే గోపికలు విరుచుకుపడ్డారు.

"బ్రహ్మ ఆన అంటావా? బ్రహ్మ ఎవరో మాకు తెలియదను కొంటావా ! నాభీ కమలంలో పుట్టినవాడు, నాలుగు మోములవాడు. నీకు వంతపాడేవాడు అతని మీద ఆననా?"

"మదనుడు ఆన అని అంటావా? ఇంకెక్కడ మన్మథుడు. ముక్కంటి మూడవ నేత్రం చిచ్చుతో బుగ్గయిపోయినవాడు. నామరూపాలు లేని వానిమీద ఆననా. నీ పాద పద్మాలను నమ్ముకొన్న మమ్మల్ని ఏం చేయాలనుకొన్నావో ఆలాగే చేయ్' అన్నారట. చక్కటి సన్నివేశమిది. మరల కన్నయ్య రేపల్లెకు రావడం అసంభవమని గోపికలకు బాగా తెలుసు. గోపికలు కృష్ణుడు వెళ్ళిపోయాక దీనాతిదీనంగా తాచ్చాదుతున్నారు. అపుడొక తుమ్మెద 'ఝుమ్మంటూ' వచ్చింది. గోపికలు ఆ తుమ్మెదతో తమ ఆవేదనను ప్రకటించుకొన్న విధానం 'విధిగె దయ ఎల్లక్క ఎన్నమేలె (దైవానికి నామీద కాసంత దయలేదక్కా·) అనే కీర్తనలో కనిపిస్తుంది.

'ముంగురులవాడు, నగుమోమువాడు అయిన కన్నయ్యను ఇక చూడలేని నిర్భాగ్యులం. పక్షులకు మల్లే మనకు రెక్కలుంటే కన్నయ్య పాదాల చెంత వాలే వాళ్ళం. కన్నయ్య వెళ్ళి పోయాక కూడా మనం బతికున్నామంటే మనం 'రాళ్ళ లాంటి వాళ్ళం'.

గృహవైద్యం

సమపాళ్ళుగా ఎండుద్రాక్ష, అడ్డరసపు ఆకు, పిప్పళ్ళు, పంచదార కలిపి కషాయం కాచి రోజుకు రెండుసార్లు త్రాగిన దగ్గు, ఆయాసం తగ్గుతవి.

వార్తలు

(01). 6-07-2021వతేది మంగళవారం కృత్తిక సందర్భంగా ఆశ్రమ ఆలయంలో ప్రదోషకాలంలో శ్రీ సుబ్రహ్మణ్య స్వామికి 'అభిషేకం అర్చన చేయబడినది.

(02). 8-07-2021వ తేది గురువారం మాసశివరాత్రి సందర్భంగా ఆశ్రమ శివాలయంలో ప్రదోషకాలంలో నర్మదేశ్వరునికి రుద్రాభిషేకం, బిల్వార్చన చేయబడినది.

(03). 14-07-2021వ తేది బుధవారం స్కంధపంచమి సందర్భంగా ఆశ్రమంలో సుబ్రహ్మణ్యస్వామి (స్కందస్వామికి) క్షీరాభిషేకం, విభూతి అభిషేకం చేసి అర్చన చేశారు.

(04). 20-07-2021వ తేది ఆషాఢ శుద్ధ ఏకాదశినాడు శ్రీసద్గురు మహర్షి మలయాళస్వాములవారి ఆరాధన శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరిగినది. స్వామిమూర్తికి అభిషేకం అర్చన జరిపి పేదలకు అన్నదానం చేయబడినది.

(05). 24-07-2021వ తేది శనివారం గురుపూర్ణిమ సందర్భంగా గురు పూజ చేయబడినది. వేదవ్యాసులవారికి అర్చన చేయబడి తుఫాన్ గిరిజనసెంటర్‌లో గిరిజనులకు అన్నదానం చేయబడినది. ఆశ్రమంలో అర్ధచాతుర్మాస్య వ్రతం ప్రారంభింపబడినది.

(06). 01-07-2021వ తేది గురువారం నుండి ఆశ్రమ కంటి ఆసుపత్రి మరల ప్రారంభింపబడినది. 7-07-2021, 14-07-2021, 21-07-2021 తేదీలందు కంటి పొరలు తీయబడి కళ్ళలో లెన్సు అమర్చబడినవి. మిగతా రోజులలో ఔట్‌పేషంటు విభాగంలో రోజూ సగటున 30మందికి కంటి పరీక్షలు చేయబడి తగు చికిత్సలు చేయబడుచున్నవి.



ఆశ్రమంలో అన్నదానం

Regd.No. TRP / 123 / 2021 - 23 August 2021 Rs.10/- R.No.8139/63
Date of Publication 26-07-2021, Permitted to post : 29th, 30th every month.

ఆశ్రమంలో ...

ఆషాడ శుద్ధ ఏకాదశినాడు శ్రీమలయాళస్వాముల వారి ఆరాధన

ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హై[illegible]బాద్, తెలంగాణ రాష్ట్రం